

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.23
సహరి(సోమ) ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	23.0

నో
విజిట్రబుల్స్

దిగొచ్చిన కూరల ధర
కిలో రూ.20లోపే పలు రకాలు
బహిరంగ మార్కెట్లో దోపిడీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 : కూరగాయల ధరలు దిగొచ్చాయి.. ఎన్నికల మహత్యమో.. పంట దిగుబడి పెరిగిందో తెలియదు కానీ అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవు తున్నాయి. దాదాపు అన్ని రకాల కూరగాయలు రైతు బజార్లలో చౌకగా దొరుకుతున్నాయి. దీంతో సాధారణ, మధ్యతరగతి కొనుగోలుదారుల్లో కొంత ఆనందం కనిపిస్తోంది. నిన్నమొన్నటి వరకూ కిలో రూ.50ల పైనే ధర పలికే దొమ్మేరు వంకాయలు ప్రస్తుతం కిలో రూ.24లకే లభించడం విశేషం. దొండకాయలు లోకల్ కిలో రూ.15లకే అమ్ముతున్నారు. రైతుబజార్లలో టమాటా కిలో రూ.14, వంకాయలు నలుపు రూ.18, వంకాయలు తెలుపు చార, గులాబీ రూ.18, బెండకాయలు రూ.22, పచ్చిమిర్చి రూ.26, కాకరకాయలు రూ.24, బీరకాయలు రూ.26, దొండకాయలు రూ.15, గోరుచిక్కుళ్ల రూ.30, దోసకాయలు రూ.12, ఆనబకాయ రూ.12, అరటికాయ రూ.7, మునగకాయ రూ.5, బొబ్బర్లు రూ.20, మామిడికాయ రూ.7 ఇలా దాదాపు కూరగాయలన్నీ దిగివచ్చాయి. కేరట్, బీట్రూట్, కీరదోస బంగాళాదుంపలు ధరలు కూడా చాలా వరకూ తగ్గాయి. కేరట్ కిలో రూ.28, బీట్రూట్ రూ.28, బంగాళాదుంపలు రూ.24లు ధర ఉంది. క్యాప్సికం, పెండల ం, చేమదుంపలు, బీన్స్‌కాయలు, బీన్స్ గింజలు, చిక్కుళ్లు ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నా సాధారణ ప్రజానీకం చాలామంది పెద్దగా వీటిని వినియోగించే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బంది పడే పరిస్థితులు లేవనేచెప్పాలి.

మార్కెట్ మాయాజాలం..

బహిరంగ మార్కెట్ మాయాజాలం ఎప్పటిలానే కొనసాగుతోంది. బహిరంగ, చిల్లర మార్కెట్లలో దోపిడీ యథాతథంగా సాగుతోంది. బహిరంగ మార్కెట్లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.50ల వరకూ అమ్ముతున్నారు. టమాటా రూ.30లు, మిర్చి 40, బీరకాయలు రూ.50, దొండకాయలు రూ.30, బెండకాయలు రూ.30 ఇలా బహిరంగ మార్కెట్లలో అన్ని కూరగాయల ధరల బాదుడు కొనసాగుతోంది. కేజీకి సుమారు రూ.15లుపైనే వేసుకుని విక్రయిస్తున్నారు.





సైకిల్ స్పీడు

సైకిల్ స్పీడు పెంచింది..అభ్యర్థుల ప్రకటన ముగియడంతో ఎన్నికలపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా శనివారం విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో టీడీపీ అధినేత చంద్రబాబు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు, అబ్జర్వర్లతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొడ్డు వెంకట రమణ చౌదరి(రాజానగరం), బూరుగుపల్లి శేషారావు (నిడదవోలు), ఆదిరెడ్డి శ్రీనివాస్(రాజమహేంద్రవరం), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి), రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మద్దిపాటి వెంకటరాజు(గోపాలపురం) హాజరయ్యారు. ఎన్నికల్లో అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. బీజేపీ పొత్తు నేపథ్యంలో ప్రస్తుత అనపర్తి ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చంద్రబాబును ప్రత్యేకంగా కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత

సజావుగా ఎన్నికల నిర్వహణకు కమిటీ

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

- ఎన్నికల ఫిర్యాదులకు డయల్ 1800-425-2540

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: సహృదయ వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం మోడల్ ప్రవర్తనా నియమావళి ఫిర్యాదులపై జిల్లా స్థాయి ప్రమాణిక కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. జాతీయ,రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఏడుగురు జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు చెందిన వారిని నియమించామన్నారు. పట్నాల విజయకుమార్(బీఎస్పీ), బొమ్ముల దత్తు(బీజేపీ), మన్నవ రఘురాం(ఆమ్‌ఆద్మీపార్టీ), పి.అరుణ్ కిరణ్(కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎం), అరిగెల అరుణకుమారి(కాంగ్రెస్), కేఎస్ జవహర్(టీడీపీ), జక్కంపూడి రాజా(వైసీపీ) కమిటీని వేశామన్నారు. ప్రకృతి విపత్తులు,ఇతర అత్యవసర పరిస్థితుల్లో కమిటీ నిర్ణయం మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల ఫిర్యాదులు నమోదుకు జిల్లాలో టోల్ ఫ్రీనెంబరు 1800-425-2540 కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ టోల్‌ఫ్రీ నెంబరు 1950 అందుబాటులో ఉందన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, సభ్యులు కన్వీనర్ బి.బాలస్వామి, సభ్యులు పి.ప్రదీప్ కుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పట్నాల విజయకుమార్, సీహెచ్.మణికృష్ణ, బి.రామచంద్రరావు, అరిగెల అరుణకుమారి, గెడ్డం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కట్టేయ్.. అడిగేదెవరు!




పేదోడు ఇల్లు కట్టుకోవాలంటే సవాలక్ష నిబంధనలు.. పంచాయతీలో ఇంటి ప్లాన్‌కు అనుమతి కావాలంటే అన్నీ ఉన్నా.. అర్హత ఉన్నా.. ఏదో ఒక మెలిక పెడతారు.. కాళ్లరిగేలా తిరగాలి లేదంటే మామూళ్లు చెల్లించుకోవాలి.. అదే పెద్దోళ్లు అయితే అసలు అనుమతుల ఊసే లేదు.. అక్రమంగా అయినా సక్రమంగా కట్టేసుకోవచ్చు. అనుకున్నది చేసేసుకో వచ్చు. అడిగేవాడుండడు.. ఆపేవాడుండడు.. ఈ రెండు సంఘటనలే అందుకు ఉదాహరణ.. అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నా కనీసం కన్నెత్తి చూసిన అధికారులే లేరు.. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమంగా కట్టేస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఆపలేక చోద్యం చూస్తున్నారు..

- అక్రమంగా భవన నిర్మాణాలు
- నేతల అండదండలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- యథేచ్ఛగా అనుమతులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు



రుడా అనుమతి లేకుండా పంచాయతీ ప్లాన్‌తో నిర్మించి భవనం



బొమ్మూరు పంచాయతీ ఇచ్చిన కమర్షియల్ ప్లాన్



నిడదవోలు మండలం తాడిమళ్ళలో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ భవనం

మేముండగా.. రుడా ఎందుకు?

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 23 : అంతా మా ఇష్టం.. అడిగేదెవడ్రా మా ఇష్టం.. అంటూ నిబంధనలు పక్కన పెట్టి మరీ ప్లాన్ అప్రూవల్స్ యథేచ్ఛగా మంజూరు చేస్తున్నారు. సాధారణంగా పంచాయతీ పరిధిలో 300 స్క్వేర్ మీటర్ల స్థలంలో జి+2 వరకు అనుమతులు మంజూరు చేసే అధికారం ఉంటుంది. అదీ కూడా నివాసయోగ్యానికి (రెసిడెన్షియల్) మాత్రమే. వ్యాపార సముదాయాలకు సంబంధించి రుడా అనుమతులు తప్పనిసరి. రుడా లైసెన్స్‌డ్ సర్వేయర్లు మాత్రమే ప్లాన్ గీసి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దానికి అనుగుణంగా పంచాయతీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేస్తారు. అయితే ఇక్కడ అలాలేదు. సర్వేయర్లు అంతా తామే చూసుకుంటాం అంటూ భవన యజయానుల నుంచి సొమ్ములకు కక్కుర్తి పడి కమర్షియల్ ప్లాన్‌లకు పంచాయతీ అప్రూవల్స్ ఇప్పించేస్తున్నారు. ఇదే అదునుగా భవన యజమానులు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఫంక్షన్ హాల్స్ నిర్మించి సొమ్ములు చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు సెంటరు నుంచి బాలాజీపేట సెంటరుకు వెళ్ళే ప్రధాన రహదారిలో ఆర్ఎస్ నంబరు 56-1లో రుడా లైసెన్స్‌డ్ సర్వేయర్ మాణిక్యాలరావు వ్యాపార సముదాయం(కమర్షియల్ ప్లాన్) బొమ్మూరు పంచాయతీకి ప్లాన్ మంజూరుకు అప్‌లోడ్ చేశారు. దీనిని పంచాయతీ కార్యదర్శి డిజిటల్ సైన్ చేసి మంజూరు చేశారు. దీంతో భవన యజమాని షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఫంక్షన్‌హాల్ కూడా నిర్మించారు. ఈ ప్లాన్ అప్రూవల్ మంజూరు విషయంలో పెద్ద మొత్తంలో చేతులు మారాయంటూ విమర్శలు ఉన్నాయి. మరొక విషయం ఏమిటంటే ఈ కాంప్లెక్స్‌కు పన్ను మదింపు చకచకా వేసేశారు. మచ్చుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రూరల్ మండల పరిధిలోని 10 గ్రామాల్లో అనధికారికంగా నిర్మించిన భవనాలతో పాటు, ప్లాన్లు డీవియేట్ చేసి నిర్మించిన భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయంటే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చు. గ్రామాల ప్రత్యేకాధికారులు మారుతున్నారు గాని క్షేత్రస్థాయిలో అవినీతి కట్టడి చేయలేకపోతున్నారు.

పొరపాటున ప్లాన్ ఇచ్చాం..

మాకు కమర్షియల్ ప్లాన్లు మంజూరు చేసే అధికారం లేదు.పొరపాటున ఇచ్చాం. సంబంధిత ప్లాన్‌లపై ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే ప్లాన్ కూడా రద్దు చేస్తాం.

- శ్రీనివాసరెడ్డి, బొమ్మూరు కార్యదర్శి

రుడా ఉండగా.. మీరెందుకు!

నిడదవోలు, మార్చి 23 : గ్రామంలో ఎక్కడైనా ఇల్లు కట్టుకోవాలంటే అధికారుల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయాల్సిందే. అలాంటిది వ్యాపార సంస్థ కోసమో లేక పరిశ్రమ కోసమో ఒక భారీ నిర్మాణం చేపట్టాలంటే నిబంధనలు అన్నీ సక్రమంగా ఉన్నా అధికారులను ప్రసన్నం చేసుకోకపోతే అడుగు కూడా ముందుకు పడదు. అలాంటిది ఒక వైసీపీ నేత అండదండలతో పంచాయతీ అధికారులకు మామూళ్లు అందడంతో నిబంధనలకు నీళ్లొదిలేసి భారీ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. బహిరంగంగానే ఈ నిర్మాణం సాగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. నిడదవోలు మండలం తాడిమళ్ళ గ్రామ పరిధిలో గత ఏడు నెల లుగా ఒక భారీ నిర్మాణం యథేచ్ఛగా సాగుతుంది. పంచాయతీ పరిధిలో ఒక పరిశ్రమకు గాని, వ్యాపార సంస్థకు చెందిన గొడౌ నుకు గాని నిర్మాణం జరగాలి అంటే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నుంచి అనుమతులు మంజూ రవుతాయి.ఈ అనుమతులు మంజూరు కావడానికి ముందుగా గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి ఆ వ్యాపార సంస్థకు సంబంధించిన పరిశ్రమపై చర్చించి అనంతరం పంచాయితీ కార్యదర్శి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) మంజూరు చేయాలి. అంతే కాకుండా అగ్నిమాపక శాఖ కార్యాలయం నుంచి కూడా ఎన్‌వోసీ మంజూరు చేయాలి. అప్పుడు రుడా స్థల పరిశీలన చేసి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తుంది. వ్యాపార సంస్థ లేక పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమవుతాయి. పంచాయతీ అనుమతి లేకుండా సుమారు ఆరు నెలలకు పైగానే ఆ భారీ నిర్మాణం సాగుతున్నా అటు వైపు కన్నెత్తి చూసిన పంచాయతీ అధికారులే లేరు. అనుమతులకు విరుద్ధం గా సాగుతున్న నిర్మాణాలపైపు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిడదవోలు మండల, పట్టణంలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నా పట్టించుకునే వారే లేరు.

పంచాయతీ అనుమతి లేదు..

తాడిమళ్ళలో గత ఏడు నెలలుగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం జరుగుతుంది. కొద్ది రోజుల కిందటే ఆ నిర్మాణానికి సంబంధించిన గుమస్తా వచ్చి ల్యాండ్ కన్వర్షన్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలు అందజేశాడు.నిర్మాణానికి సంబంధించి ఎటువంటి పత్రాలు పంచాయతీకి సమర్పించలేదు. పంచా యతీ నుంచి ఎటువంటి ఎన్‌వోసీ ఇవ్వలేదు.

- టి.గోపాలకృష్ణ, తాడిమళ్ళ కార్యదర్శి

అంతా ఓకే!



పి.గన్నవరం అభ్యర్థి గిడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న పవన్

- కోనసీమ జిల్లా పి.గన్నవరంలో రాజకీయ ఉత్కంఠకు తెర
- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధికారిక ప్రకటన
- జోష్‌లో ఉన్న గన్నవరం నియోజకవర్గ కూటమి శ్రేణులు
- ఉమ్మడి తూర్పుగోదావరిలో అన్ని సీట్లకు అభ్యర్థులు ఖరారు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయపరంగా ఉత్కంఠ రేపిన పి.గన్నవరం రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పోటీ చేస్తున్నట్టు ప్రకటించింది. స్వయంగా జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణే ఈ ప్రకటన చేశారు. నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును శనివారం ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి విడత జాబితాలో పి.గన్నవరం స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. అయితే రాజేష్ అభ్యర్థిత్వం పట్ల వ్యక్తమైన అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని మార్పు అనివార్యమైంది. టీడీపీ ఖాతాలో ఉన్న ఈ సీటు వ్యూహాత్మకంగా జనసేనకు దక్కింది. టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ యూట్యూబ్ చానల్‌లో గతంలో టీడీపీ, జనసేన, హిందూ కులాలకు వ్యతిరేకంగా చేసిన వీడియోల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ ప్రజలు, ఆయా పార్టీల కేడర్ వ్యతిరేకించడంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీకి నష్టం కలగకూడదనే సదుద్దేశంతో మహాసేన రాజేష్ స్వచ్ఛందంగా తానే గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిత్వం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటన చేశారు. పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా టీడీపీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన స్వచ్ఛంద ప్రకటన సారాంశం. అయితే తరువాత తన నిర్ణయం పట్ల పార్టీ నుంచి ఎటువంటి స్పందన వెలువడకపోవడంతో మళ్లీ పోటీ చేసేందుకు రాజేష్ సిద్ధంగా ఉన్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పి.గన్నవరం అభ్యర్థిత్వం ఆటలాడుకుందనే చెప్పాలి. ఆయా పార్టీలకు చెందినవారు ఆ నియోజకవర్గం నుంచి తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తూ నియోజకవర్గ ఓటర్లను గందరగోళంలో ముంచెత్తారు. టీడీపీ నుంచి కొందరు. బీజేపీ నుంచి టీఎస్ఎన్ మూర్తి, మానేపల్లి అయ్యాజీవేమాల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తింది. అయితే గన్నవరం సీటు పైనే ఆశలు పెట్టుకుని పోలీసు శాఖలో చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణచేసి జనసేనలో చేరిన గిడ్డి సత్యనారాయణ పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నాన్ని కొనసాగించడంతో చివరకు విజయం సాధించారు. టీడీపీ స్థానంలో జనసేన నుంచి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం చేసిన ప్రకటనతో ఈ నియోజకవర్గంపై అటు టీడీపీ, ఇటు బీజేపీలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. దాంతో జనసేన కేడర్‌లో ఆనందం పెల్లుబికుతోంది. పైగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న జనసేన విజేతల సమాచారాన్ని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తం చేయడంతోపాటు వారు పార్టీ కోసం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకుని గన్నవరం స్థానం నుంచి జనసేన అభ్యర్థిని పోటీలోకి పెడుతున్నామని, మీరంతా కష్టపడి పనిచేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మొత్తం మీద తొలి జాబితాలో టీడీపీ ప్రకటించిన స్థానాన్ని జిల్లాలో చిట్టచివరి స్థానంగా జనసేన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ క్రమంలో అభ్యర్థుల బలాబలాలపై తాజా చర్చ మొదలైంది.

పి.గన్నవరాన్ని పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా అందిస్తా

- జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సహకారంతో పి.గన్నవరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి జనసేనాని పవన్‌కల్యాణ్ గిఫ్ట్‌గా అందిస్తా. నామీద నమ్మకంతో సీటు కేటాయించిన పవన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. జనసేన అధినేత ఆశయాలతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రతి నిరుపేదకు అండగా నిలుస్తాను. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

అభ్యర్థి వివరాలివీ..

గిడ్డి సత్యనారాయణ స్వగ్రామం పి గన్నవరం మండలం ఊడిమూడి శివారు ఊడిమూడిలంక. బీఏ, బీఎల్ చదువుకున్న ఆయన హైదరాబాదు సిటీ కమిషనర్ కార్యాలయంలో 20 ఏళ్లుగా అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయపరంగా 1989లో తెలుగు యువత జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఇటీవల జనసేనలో చేరిన ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంలోని అన్ని సీట్లకు అభ్యర్థులను టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించింది. తొలి సీటును మండపేట నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారు. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును తమ అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజానగరం నుంచి తమ పార్టీ పోటీ చేస్తున్నట్టు తొలిసారిగా ప్రకటించారు. ఆ తర్వాత విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ రాగా చివరిగా శనివారం పి.గన్నవరం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను పవన్ ప్రకటించడంతో అన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. ఇక పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లు ఉండగా, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో పశ్చిమగోదావరి నుంచి కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీట్లు వచ్చి చేరాయి. అంటే రంపచోడవరంతో కలిపి 22 సీట్లు అయ్యాయి.

మొత్తం అసెంబ్లీ సీట్లు : 22
ఉమ్మడిగా సీట్ల పంపకం..
తెలుగుదేశం : 16, జనసేన : 6

28 నుంచి దివ్యాంగులకు సదరం శిబిరాలు

రాజమహేంద్రవరం సిటీ,మార్చి 23: జిల్లాలో కొవ్వూరు-రాజమహేంద్రవరం డివిజన్లలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. దివ్యాంగుల వైకల్యం నిర్ధారణకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాలుగు చోట్ల మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైక్యల నిర్ధారణ జరిగిన తర్వాత అవసరమైన ఉపకరణాలు అందజేస్తారని చెప్పారు. ఈ శిబిరాల వద్ద పిల్లలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశామని.. అలాగే రవాణా ఖర్చులు ఇస్తామని తెలిపారు. 28న కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని నల్లజర్ల, గోపాలపురం, తాళ్లపూడి, దేవరపల్లి,కొవ్వూరు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. 30న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కడియం, అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ మండలాలకు చెందిన దివ్యాంగులు వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 1న నిడదవోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శిబిరాన్ని పెరవలి, ఉండ్రాజవరం, చాగల్లు, నిడదవోలు దివ్యాంగులు, వచ్చే నెల 3న కోరుకొండ గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగే శిబిరాన్ని సీతానగరం, రాజానగరం, గోకవరం, రంగంపేట, కోరుకొండ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సీఎస్ సమీక్షలో కలెక్టర్ మాధవీలత

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

51 హాబిటేషన్లలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : కలెక్టర్


రాజమహేంద్రవరం రూరల్, మార్చి 23: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో ఉపాధి హామీ పనులు, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రానున్న వేసవిలో 51 హ్యాబిటేషన్స్ పరిధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో కోరుకొండ, గోకవరం, సీతానగర, రాజానగరం, గోపాలపురం, రంగంపేట ప్రాంతాలు అప్ ల్యాండ్ కిందకు వస్తాయని చెప్పారు. జిల్లాలో 2023-24 ఆర్థిక ఏడాది కింద 52 లక్షల పని దినాలకు సుమారు 49 లక్షల పనిదినాలు లక్ష్యం సాధించినట్లు తెలిపారు. జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని మే రెండో వారం వరకు జరుగుతాయన్నారు.సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డ్వామా పీడీ ఏ.ముఖలింగం పాల్గొన్నారు.



ఓటు నమోదుకు ఇంకా అవకాశం

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం, అలాంటి ఓటు ఉందో లేదో ఒక్కసారి ఓటర్ల జాబితాలో చూసి పరిశీలించుకోవాలి. ఓటు ద్వారానే ప్రజలకు మేలు చేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోగలం. ప్రజాస్వామ్యంలో నిరంకుశత్వవాదులను తరిమికొట్టాలంటే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. కాకినాడ జిల్లాలో 16 లక్షల 11 వేల మంది ఓటర్లు ఉన్నారు. రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే అవగాహన లేకపోవడం వలన ఇప్పటికీ కొంతమంది ఓటు ఉందో లేదో పరిశీలించుకోలేకపోతున్నారు. అలాంటి వారి కోసం ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చినందున ఇక నుంచి జాబితా నుంచి ఓట్ల తొలగింపు, మార్పులకు అవకాశం లేదు. కేవలం కొత్తగా నమోదుకు మాత్రమే అవకాశం కల్పించారు. అయితే ఓటర్ల జాబితాలో ఓటు లేనివారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు.

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 23:



ప్లేస్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి చెందిన ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మీ ఫోన్ నెంబర్ వివరాలు పొందుపర్చి రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత లాగిన్ అయ్యి ఓటర్ రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళితే న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తు నింపి సబ్‌మిట్ చేయాలి. https://voterportal.eci.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యి వెబ్‌సైట్‌లో ప్రవేశించిన తర్వాత న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్ అనే విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేసి దరఖాస్తులో వివరాలు నింపి సబ్‌మిట్ చేయాలి.



ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

www.nvsp.in వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. రిజిస్టర్ యాజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేసిన అనంతరం ఫాం 6 దరఖాస్తు ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే ఆన్‌లైన్ దరఖాస్తు కనిపిస్తుంది. దానిలో అడిగిన వివరాలు నింపి సబ్‌మిట్ కొట్టాలి. ఆ తర్వాత ఫోన్ నెంబర్‌కు రిఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి ఇంటి అడ్రస్‌కు వచ్చి పరిశీలిస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు.



ఫారం 6 సమర్పించాలి

ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వారు బూత్‌స్థాయి అధికారులకు ఫారం 6 దరఖాస్తు సమర్పించాలి. అలాగే ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. వారికి కూడా దరఖాస్తులను సమర్పించవచ్చును. అలాగే ప్రతి మండలంలో తహసీల్దార్ గానీ డిప్యూటీ తహసీల్దార్‌ను గానీ సంప్రదించి దరఖాస్తులను ఇచ్చి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్న 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదించవచ్చును.

- ఏప్రిల్ 15వతేదీ వరకు నమోదు
- ఒక్కసారి ఓటు ఉందో.. లేదో పరిశీలించుకోండి
- ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటే
- ప్రతిఒక్కరూ ఓటర్ల జాబితా పరిశీలించుకోవాలి
- నేరుగా అధికారులకు దరఖాస్తు
- ఆన్‌లైన్‌లోనూ సులువుగా నమోదు

కొత్తగా నమోదు చేసుకోండి

రామ్‌సుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, కాకినాడ జిల్లా



ఇప్పటికీ కూడా ఎవరిదైనా ఓటు జాబితాలో లేకపోతే కొత్తగా నమోదు చేసుకోవచ్చునని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి చెప్పారు. ఏప్రిల్ 15 వరకు కొత్తగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. అయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు ఇక లేవన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చునని వెల్లడించారు. దీని కోసం జిల్లాతో పాటు మండల స్థాయిలో కూడా ఎన్నికల అధికారులను సంప్రదించాలన్నారు.



గోవిందా..గోవింద

భక్తజన సంద్రంగా మారిన వాడపల్లి

ఆత్రేయపురం, మార్చి23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తజనసంద్రమైంది. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 42 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 20 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.48.82 లక్షలు లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి



అల్లవరం, మార్చి 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ ఆన్‌షోర్ టెర్మినల్‌లో టాటా సంస్థ స్టోర్ ఇన్‌చార్జి కొల్లు వెంకటరమణరావు (55) వడదెబ్బకు మృతిచెందాడు. ఓడలరేవుకు చెందిన ఆయన శనివారం ఉదయం డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 3.30గంటలకు స్టోర్ నుంచి కిలోమీటరు నడిచివెళ్లి కుప్పకూలిపోయాడు. టాటా సిబ్బంది అతడిని బెండమూర్లంక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. టీడీపీ నేత, మాజీ సర్పంచ్ కొల్లల సత్యనారాయణమూర్తి తనయుడు ఈయన.

నేటి నుంచి ఆర్జిత సేవగా రథసేవ

అన్నవరం, మార్చి 23: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం నుంచి నూతనంగా మరో ఆర్జితసేవను ప్రవేశపెట్టనున్నారు. ఇటీవల చేయించిన నూతన రథంపై స్వామి, అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. అయితే దీనిని ఆర్జిత సేవగా ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆమోద ముద్ర వేయడంతో రూ.2500 టిక్కెట్ ధరగా నిర్ణయించారు. ఈ టికెట్ తీసుకునే భక్తులకు ముందుగా గోత్రనామాలతో పూజలు చేసి స్వామివారి కండువా రవికల వస్త్రం, ప్రసాదం ప్యాకెట్లను అందజేయడంతో పాటుగా నలుగురికి అంతరాలయ దర్శన ప్రవేశం కల్పించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యానాం, మార్చి 23: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. అశేష జనవాహినితో యానాం రహదారులు కిక్కిరిసిపోయాయి. కశిరెడ్డి సత్యవీరవెంకన్న, కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, సుబ్రహ్మణేశ్వరరావు ఉత్సవదారులుగా రథోత్సవం నిర్వహించారు. స్థానిక చిన్న సెంటర్ వద్ద స్వామివారి రథోత్సవాన్ని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ప్రతినిధులు, పలువురు ప్రముఖులు శనివారం సాయంత్రం 4.45గంటలకు ప్రారంభించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రథంలో వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొత్త బస్టాండ్‌లో భక్తుల దర్శనార్థం రథాన్ని ఉంచారు. తొలుత చిన్న రథంలో స్వామివారిని ఉంచి యానాం వీధుల్లో ఊరేగించారు. అనంతరం పెద్ద రథంలో స్వామివారిని కొలువుదీర్చి పిల్లారాయ వీధిలో ఊరేగించారు. ఎస్పీ రాజశేఖర్ నేతృత్వంలో సీఐ షణ్ముగం పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కోరుకొండ కిటకిట

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- కిటకిటలాడిన వీధులు
- గజ వాహనంపై గ్రామోత్సవం


రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు


వైభవంగా రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం


తరలివచ్చిన భక్తులు

కోరుకొండ, మార్చి 23: కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో 4వ రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి విచ్చేశారు. కొండపైన, కొండ దిగువున సుమారు 30 వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరందరికీ మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదే విధంగా రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న 92వ విశిష్టాద్వైత పండిత సభలను భక్తులు సందర్శించారు. 4వ రోజున పరాసర లక్ష్మీనరసింహ భట్టర్‌స్వామి అధ్యక్షతన జరిగిన సభల్లో ఉభయ వేదాంత పండితులు కేశ స్వామి, కేశ తలసాయి స్వామి, పరాసర రఘునాథ భట్టర్‌స్వామి, పరాసర శ్రీ వత్స చిన్న భట్టర్ స్వామి, ఇరగవపు కృష్ణామాచార్యుల స్వామి ఉపన్యసించారు. రామాయణం, మహాభారత, భాగవత, బ్రహ్మసూత్రములు, ఆళ్వారుల దివ్య ప్రబంధంలోని విషయాలను పామరులకు సైతం అర్థమయ్యే విధంగా తెలియజేశారు. లక్ష్మీ నరసింహ స్వామి కళావేదికపై చిన్నారుల ప్రదర్శించిన భరత నాట్యం ఆకట్టుకుంది. సుమారు 20 వేల మందికిపైగా మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో అన్న ప్రసాదం అందజేసినట్లు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు.

గజ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

శ్రీ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు రాత్రి స్వామి వారు గజ వాహనంపై గ్రామోత్సవం చేశారు. ప్రతిరోజు సాయంత్రం జరిగే నిత్య హోమం, బలిహరణ, సేవాకాలం అనంతరం స్వామి వారిని గజవాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారి అశ్వవాహనం గ్రామంలో నాలుగు మాఢ వీధుల్లో విహరించింది. భక్తులు స్వామి వారికి పండ్లు ఫలహారాలు సమర్పించి మంగళనీరాజనాలు అందజేశారు.

వైభవంగా శ్రీ రంగనాథస్వామి కల్యాణ మహోత్సవం

శనివారం రాత్రి 10 గంటలకు రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాములు పర్యవేక్షణలో గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులైన ఎస్‌టీపీ వెంకటరమణాచార్యుల స్వామి వెంకటరమణాచార్యులు స్వామి దంపతులచే కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు.

‘పొన్నాడ’కు నిరసన సెగ

- చొల్లంగి గ్రామంలో అడ్డుకున్న మహిళలు
- మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించిన నేతలు
- ఎదురుతిరిగిన గ్రామస్థులు


పొన్నాడను అడ్డుకున్న మహిళలు


తాళ్లరేవు, మార్చి 23: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌కు నిరసన సెగలు తగిలాయి. చొల్లంగి మహిళలు శనివారం ఎమ్మెల్యేను అడ్డుకుని ఇతర నియోజకవర్గాల లబ్ధిదారులకు సర్వేనెం.47/3, 4.24 సెంట్లలో ఇండ్లస్థలాలు ఇవ్వొద్దని ఈ స్థలాలను స్థానికులకే ఇవ్వాలని లబ్ధిదారులు 47 రోజులుగా నిరసన దీక్షలు చేసినా ఎమ్మెల్యే కానీ, వైసీపీ నేతలు కానీ ఏవిధంగా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు ఎన్నికల వచ్చాయని ఓట్లు కావాల్సి వచ్చాయా అని ఎమ్మెల్యేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య తన దృష్టికి రాలేదని ఎమ్మెల్యే చెప్పారు. ఎవ్వరికో తమ గ్రామంలో ఇండ్లస్థలాలు ఇచ్చి ఓట్లు మాత్రం మమ్మల్ని అడగడం ఎందుకని నిలదీశారు. ఓట్లు అడిగే అర్హత మీకులేదని అన్నారు. దీంతో ఎమ్మెల్యే, లబ్ధిదారులు, వైసీపీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. వైసీపీ నాయకులు లబ్ధిదారులను తోలు తీసేస్తామనడంతో మహిళలు వైసీపీ నాయకులపై ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో భయపడిన నాయకులు అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు ఆధ్వర్యంలో స్థానికులు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కార్యదర్శికి వినతిపత్రం అందించారు.

అండగా నిలిచే పార్టీలకే మా మద్దతు

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం
- ‘జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం నిర్ణయం

సర్పవరం జంక్షన్, మార్చి 23: ‘జయలక్ష్మి సొసైటీ పాత కార్యవర్గం నిర్వాహకులు ఆర్థిక మోసానికి పాల్పడి ఏప్రిల్ 6వ తేదీకి రెండేళ్లు కావస్తోంది. మోసపోయిన వారిలో 50 మంది బాధితులు చనిపోయారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. బాధితులకు అండగా నిలిచే రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుంది’ జయలక్ష్మి సొసైటీ బాధిత సంఘం సభ్యులు తెలిపారు. శనివారం సాయంత్రం సర్పవరం జంక్షన్‌లో గల జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎదుట బాధిత సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు, అంగర నరసింహారావు, చిప్పల శంకరం, కృష్ణారావు, పల్లంరాజు, రాజగోపాల్ మాట్లాడుతూ పాత చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అయితే నూతన పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు ఆధ్వర్యంలో సభ్యులు నిందితుల ఆస్తులు గుర్తించి సీబీసీఐడీ ద్వారా న్యాయస్థానం ద్వారా సీజ్ చేసినట్టు చెప్పారు. సీజ్ చేసిన ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయస్థానం నుంచి త్వరలో అనుమతులు వచ్చేలా కృషి చేయాలన్నారు. 50 మంది బాధితులు చనిపోతే ప్రభుత్వం నయాపైసా నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. సుమారు 300 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయని, అడ్వాన్సుగా బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. బాధితులంతా సుమారు 20 వేల మంది ఉన్నామని, వైజాగ్ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు 7 నియోజకవర్గాల్లో సుమారు 2 లక్షల ఓట్లు తమకు ఉన్నాయన్నారు. ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లో బాధితుల సంఘం నుంచి ఒక్కో నియోజకవర్గం నుంచి అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపి నిరసన తెలియజేసి సత్తా చూపిస్తామని స్పష్టం చేశారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పెద్దాపురం, మార్చి 23: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం లోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ.2,86,700, అన్నదాన విరాళాలు ద్వారా రూ. 60,237 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.5,720, తులాభారం రూ.300 వెరసి రూ.3,52,957 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ లొంగుబాటు

ఎటపాక, మార్చి3: మావోయిస్ట్ పార్టీకి చెందిన కిష్టారం ఏరియా కమిటీ డిప్యూటీ కమాండర్‌గా వ్యవహరిస్తున్న మడివి ఊరలు అలియాస్ ఊర శనివారం పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓఎస్డీ కె.మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలో సాకిలేరు గ్రామానికి చెందిన ఊర మావోయిస్ట్ పార్టీలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. 2006 సంవత్సరంలో దర్భగుడా గ్రామంలో ఇద్దరు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అలాగే 2006 సంవత్సరంలో బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తచెరువు గ్రామంలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇన్‌చార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో ఊర పాల్గొన్నాడని, ఆ ఘటనలో 9 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మృతిచెందినట్లు చెప్పారు. 2007 సంవత్సరంలో ఇంజరం సమీపంలోని చీకకొరుగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు సాల్వాజుడెం సానుభూతిపరులను హత్య చేసిన ఘటనలో ఊర పాల్గొన్నాడని చెప్పారు. అదే ఏడాది కుంట పీఎస్ పరిధిలో అప్పటి కుంట ఏరియా కమిటీ ఇంచార్జ్ దేవ డీవీసీఎం ఆధ్వర్యంలో కుంట యాక్షన్ కమిటీ సభ్యులు (మావోయిస్టులు) జరిపిన ఐఈడీ పేలుడు ఘటనలో 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు మరణించినట్లు చెప్పారు. జనజీవన స్రవంతిలో కలిసిన ఊరకు రూ 4 లక్షల రివార్డుతో పాటు ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు కల్పిస్తామని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. సీఐ డి.రామారావు, ఎస్ఐ కె పార్థసారథి పాల్గొన్నారు.

అభ్యుదయ రైతులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేయాలి

దివాన్‌చెరువు, మార్చి 23: ప్రతి ఆర్బీకే పరిధిలో ఐదుగురు అభ్యుదయ రైతులను గుర్తించి వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.విజయాభినందన చెప్పారు. వీఏఏల సహాయంతో వారికి సందేశాలను పంపాలని సూచించారు. దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రాన్ని మారుటేరు పరిశోధన స్థానం అధికారి డాక్టర్ డి.శ్రీనివాస్‌తో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరువాక కేంద్రం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని కాలానుగుణంగా రైతులకు చేరవేయడంలో కృతకృత్యులయ్యారని అన్నారు. భవిష్యత్‌లో ఇంకా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు ఏరువాక కేంద్రం మరింత చేరువ కావాలంటే అనుసరించాల్సిన విధానాలను సూచించారు. మారుటేరు పరిశోధనా స్థానం అధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో జిల్లాలో చాలా మంది రైతులు ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాలు ద్వారాను, ఇ-విస్తరణ ద్వారానూ రైతులకు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయాభినందనను ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్తలు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ హైమజ్యోతి ఘనంగా సత్కరించారు.

భద్రాచలానికి తలంబ్రాల బియ్యం


తలంబ్రాల బియ్యాన్ని పంపిస్తున్న భక్తులు

నల్లజర్ల,మార్చి 24: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం ఉభయగోదావరి జిల్లాల్లో రామభక్తుల నుంచి సేకరించిన ఐదు టన్నుల బియ్యాన్ని భద్రాచలం పంపించినట్టు శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి జంగారెడ్డిగూడెం సభ్యులు పేర్కొన్నారు. శనివారం నల్లజర్లలో జెండా ఊపి బియ్యం వాహనాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులకు శ్రీరాముని తలంబ్రాలు అందించే నిమిత్తం తాము ఈ కార్యక్రమం తలపెట్టినట్టు సభ్యులు పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, బిక్కిన శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు చెప్పారు.

శనేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ


అభిషేకాలు నిర్వహించుకుంటున్న భక్తులు

కొత్తపేట, మార్చి23: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. స్వామివారి ప్రతఃకాళ అర్చన అనంతరం సర్వదర్శనములకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.12,79,153 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. విశాఖపట్నానికి చెందిన వాడపల్లి శేసేంద్రభానుప్రకాష్ రెండువేల మజ్జిగ ప్యాకెట్లు, 50 కేజీల దద్దోజ్యనం భక్తులకు వితరణ చేశారు. అలాగే వృద్ధులు, వికలాంగుల సౌకర్యం కోసం ఉచిత ఆటోను దేవస్థానం ఏర్పాటు చేసింది.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

క్షయ వ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత

● ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



ర్యాలీ ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం, మార్చి 23:ఏజెన్సీలో క్షయ వ్యాధి నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే చెప్పారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ 2025 నాటికి క్షయవ్యాధిని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వ్యాధిపై అవగాహన లేక చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతిగ్రామంలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించాలన్నారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో మానవహారంగా ఏర్పడిప్రతిజ్ఞ చేయించారు. ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి, వైద్యాధికారులు వెంకట ఇందిరా, రాధిక, అపూర్వ, వినోద్, సుజిత, సాహిన్, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చంద్రబాబు సమావేశానికి మిరియాల శిరీషాదేవి హాజరు


చంద్రబాబు సమావేశానికి హాజరైన ఉమ్మడి అభ్యర్థి శిరీషదేవి

రంపచోడవరం, మార్చి 23: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు విజయవాడలో శనివారం టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రానున్న ఎన్నికల్లో విజయం సాధించే వ్యూహంపై కూటమి అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. రంపచోడవరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీషాదేవి హాజరయ్యారు.

మోతుగూడెంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



మోతుగూడెం, మార్చి 23: చింతూరు మండలం మోతుగూడెం మార్కెట్ సెంటర్‌లో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత నాదెళ్ల రమేష్ లీలారాణి, కుమారుడు లోకేష్ కుష్మల పూజలు నిర్వహించగా విగ్రహ ప్రతిష్ఠను ప్రధాన అర్చకులు అయినవిల్లికుమార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠకు మోతుగూడెం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకేటి సతీ, వార్డు మెంబర్ మల్లూరు రమాదేవి, ఏపీజెన్కో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ఇదేం వివక్ష


మోతుగూడెం సెంటర్‌లో రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్‌విగ్రహాలకు ముసుగు వేయించిన అధికారులు, పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాత్రం మినహాయింపు ఇచ్చిన దృశ్యం

మోతుగూడెం, మార్చి 23: ఎన్నికల నియమావళి అంటే అందరికీ, అన్ని పార్టీలకు ఒకే విధంగా పాటించాల్సిన అధికారులు మోతుగూడెంలో మాత్రం ఎందుకో వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతూరు మండలం, మోతుగూడెం సెంటరులో రాజీవ్‌గాంధీ, నందమూరి తారక రామారావు, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలున్నాయి. కాగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే రాజీవ్‌గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు ఆగమేఘాల మీద ముసుగులు వేయించిన అధికారులు పక్కనే ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. దీంతో ఇదేం వివక్ష అంటూ అధికారుల తీరుని పలువురు ఆక్షేపిస్తున్నారు.

సీపీఎం బృందం పర్యటన

చింతూరు, మార్చి 23 : ఏజెన్సీ ప్రాంత హక్కుల పరిరక్షణ ఒక్క సీపీఎంకే సాధ్యమని సీపీఎం మండల కార్యదర్శి సీసం సురేష్ చెప్పారు. సీపీఎం బృందం మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం విస్తృతంగా పర్యటించింది. గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లోత రామారావు, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పొడియం లక్ష్మణ్, వేక రాజకుమార్, మొట్టుం రాజయ్య, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద పరిరక్షణ అందరి బాధ్యత


● కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు



పశు పోషణ గురించి వివరిస్తున్న కెవికె హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు

రాజానగరం, మార్చి 23: ప్రస్తుత యాంత్రీకరణ వ్యవసాయంలో కనుమరుగవుతున్న పశుసంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలవచర్లలోకి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు పిలుపునిచ్చారు. పశుపోషణ, పశువుల్లో ప్రథమ చికిత్స, యాజమాన్యంపై గ్రామీణ యువతకు కేవీకేలో వారం రోజులపాటు నిర్వహించే ఈకార్యక్రమాన్ని నాయుడు శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో పోషణ యాజమాన్యం, ప్రథమచికిత్సల ఉపయోగాలను యువతకు వివరించారు. పశుగ్రాస పంటలవల్ల చేకూరే ఆర్థిక లాభాలు, పోషక విలువలను తెలియజేశారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ గ్రామీణ యువతకు సాధికారత దిశగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, ముఖ్యంగా శిక్షణతోపాటు ఉపాధి మార్గాలను కల్పిస్తున్నారన్నారు. అనంతరం కేవీకేలో పొట్టి మేకల పెంపకం, కోళ్ల పెంపకం, పశుగ్రాసం సూపర్ నేపియర్, కో-4 రకాలపై క్షేత్ర సందర్శన చేశారు. 1కేవీకే రిటైర్డ్ పశు వైద్యులు జాన్‌బాబు, పీవీవీఎస్ శివరావు, కేవీకే అధికారులు టి.విజయవర్ధన్, జె.ప్రభాత్‌నాయుడు, 15మంది గ్రామీణ యువకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఆర్ఐ నందకిషోర్

బిక్కవోలు, మార్చి 23: ఓటు హక్కుపై ప్రతిఒక్కరూ ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నందకిషోర్ సూచించారు. బిక్కవోలు శ్రీప్రజా కళాశాలలో భారత ప్రభుత్వ యువజన క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ ఓటు హక్కును అందరూ సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువక కేంద్ర వలంటీర్ మణికంఠరామకృష్ణారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఓదూరి శ్రీను, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవి. కృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గైట్‌లో ముగిసిన ఎన్డీటీ సర్టిఫికేషన్ కోర్సు

రాజానగరం, మార్చి 23: గైట్ అటానమస్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం సినర్జిమ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అప్లికేషన్ ఆఫ్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ మెథడ్స్ (ఎన్డీటీ)పై నిర్వహించిన సర్టిఫికేషన్ కోర్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గైట్ మెకానికల్ విభాగాధిపతి ఎ.నిర్మలాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు మూడువారాల పాటు ఈశిక్షణ కల్పించామన్నారు. విద్యార్థులకు దోహదపడుతుందని ప్రిన్సిపాల్ శర్మ చెప్పారు. కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. గైట్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, సినర్జిమ్ సీఈవో టి.విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల విజయం ఖాయం

● అనపర్తి ఉమ్మడి అభ్యర్థి రామకృష్ణారెడ్డి
● మంగళగిరిలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో బాబు వర్క్‌షాప్

అనపర్తి, మార్చి 23: శనివారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు, అబ్జర్వర్లతో నిర్వహించిన వర్క్‌షాపులో అనపర్తి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులు రాష్ట్రంలో భారీ మెజార్టీ సాధించడం ఖాయమని అన్నారు. అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై చంద్రబాబు దిశా నిర్దేశం చేశారన్నారు. రాష్ట్రంలో గెలుపు అవకాశాలను దృష్టిలో ఉంచుకుని టిక్కెట్లు ఇచ్చామని ఆయన పేర్కొన్నారని అన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలకు వివరించాలని ఆయన ఈసందర్భంగా కోరినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

టీడీపీ వర్క్‌షాప్‌లో ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత చంద్రబాబు అభ్యర్థులందరికీ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని అభ్యర్థులు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యం

రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని రాజమహేంద్రవరం టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 40వ డివిజన్‌లో శనివారం జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కరపత్రాలు పంపిణీ చేశారు. జగన్ ప్రభుత్వం అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎంపీ భరత్ తన స్వార్థం కోసం వలంటీర్లను వినియోగించుకుని వారి ఉపాధికి గండి కొట్టారని విమర్శించారు. రౌడీషీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లతో ప్రజలు భయపెట్టేందుకు చూస్తున్నారని, సొంత వ్యక్తికి మునిసిపల్ కాంట్రాక్టు ఇప్పించుకుని, ప్రతి పనికి 25శాతం కమీషన్ తీసుకున్నారని, అటువంటి వ్యక్తికి మళ్లీ పదవి ఇవ్వడం శ్రేయస్కరం కాదని ప్రజలు భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింహా నాగమణి, సింహా వెంకటేష్, కొల్లి నాని తదితరులు పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న ఆదిరెడ్డి శ్రీనివాస్

వలంటీర్లను ఇరకాటంలో పెట్టింది ఎంపీ భరతే

● 25 శాతం కమీషన్ తీసుకుని నీతి కబుర్లు : అనుశ్రీ


మాట్లాడుతున్న అనుశ్రీ సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలులో వుందని తెలిసి కూడా వలంటీర్లను పిలిచి సమావేశం పెట్టి వాళ్లను ఇరకాటంలో పెట్టింది ఎంపీ భరతేనని జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అత్తి (అనుశ్రీ) సత్యనారాయణ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అనుశ్రీ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులమాటున 25శాతం కమీషన్ తీసుకునే భరత్.. పవన్ కళ్యాణ్‌ను విమర్శిస్తాడా, రాజమహేంద్రవరంలో డిపాజిట్లు కూడా రావని అన్నారు. పవన్‌ను అత్యధిక మెజార్టీతో పిఠాపురం ప్రజలు గెలిపించబోతున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు మీటింగ్‌లు పెట్టకూడదని తెలిసి కూడా వలంటీర్లతో మీటింగ్ పెట్టి వాళ్లకు ఉద్యోగాలు లేకుండా చేశాడని, పైగా ఆ బురద తమ అభ్యర్థిపై జల్లే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కాంట్రాక్టరు మార్గాని సురేష్ కనుసన్నల్లో మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి అన్నిపనులు జరగడం వెనుక భరత్ ఉన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, పైడి రాజు, నల్లంశెట్టి వీరబాబు, శ్యాంసుందర్, విన్నవాసు పాల్గొన్నారు.

'వ్యాపారులంటే ఎంపీ భరత్‌కు కక్ష'


మాట్లాడుతున్న జానకిరామయ్య, మజ్జి రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: రాజమహేంద్రవరంలో వ్యాపారులపై ఎంపీ మార్గాని భరత్‌రామ్ కక్షగట్టారని టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, యిన్నమూరి రాంబాబు విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో తాము 22 రోజుల పాటు పర్యటించామని, వ్యాపారాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లోనే భరత్‌రామ్ రోడ్లు తవ్వేసి నెలల తరబడి అలాగే ఉంచేస్తున్నారన్నారు. తన 25శాతం కమిషన్ కోసం ఆయన ఏం చేయడానికైనా ఎవరిని ఇబ్బంది పెట్టడానికైనా సిద్ధమేనన్నారు. ఎంపీ భరత్ మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారని, అయితే ఆదిరెడ్డి వాసు ఆ ప్రాంతంలో పర్యటించిన సమయంలో స్థానిక వ్యాపారులు సెంట్రల్ లైటింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని, తాము అధికారంలోకి వచ్చాక తొలగిస్తామని వాసు హామీ ఇవ్వడంతో రాత్రికి రాత్రే వాటిని ఎంపీ తొలగించాడని విమర్శించారు. నగరంలో ఏవీఏ రోడ్డు, దానవాయిపేట రోడ్లను తవ్వేసి నెలల గడచినా పూర్తి చేయలేదని, దీంతో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంపీ భరత్‌రామ్ వన్‌టైమ్ పొలిటీషియన్ అనివర్ణించారు. సమావేశంలో నగర ట్రేడర్స్ సెల్ అధ్యక్షుడు నిమ్మలపూడి గోవింద్, మస్తాన్ చౌదరి, ముప్పన రుద్ర, మదినా సాహెబ్ పాల్గొన్నారు.

స్థానిక రైతు బిడ్డకు ఒక్క అవకాశం ఇవ్వండి

● ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, మార్చి 23: తాను కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన సామాన్య రైతు బిడ్డనని..తనకు ఒక్క అవకాశం ఇస్తే రైతును రాజును చేస్తానని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద శనివారంఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఉపాధిలేక ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు తరలిపోవడంతో తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయం మరుగున పడుతుందని జనసేన, టీడీపీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ప్రాంత ప్రజలందరికీ ఉపాధి కల్పించే విధంగా రాజానగరంను అభివృద్ధి చేస్తానని బలరామకృష్ణ పేర్కొన్నారు. వైసీపీలో కుదేలైన రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కాలువల్లో పూడిక తీసి ప్రతి ఎకరానికి నీరు అందిస్తామన్నారు. గోదావరి ప్రక్కనే ఉన్న మంచినీరు అందక గొంతు ఎండుతుందన్నారు. ప్రతి ఇంటికి విద్య, వైద్య, సంక్షేమం, రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మేలైన పాలన అందిస్తామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, అద్దాల శ్రీనివాస్, భూషణం, తాతాజీ, రాంబాబు, బాపిరాజు, మట్టా సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల బలరామకృష్ణ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి

రాజానగరం, మార్చి 23: భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతిని రైతు సమన్వయ సమితి(ఎస్‌కెఎం)పిలుపు మేరకు ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్తిబాబు మాట్లాడుతూ దేశంలో సమసమాజ స్థాపన, దోపిడీలేని సమాజం కోసం అతిచిన్న వయస్సులో దేశంకోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ రాజు గురు సుఖదేవుల ఆకాంక్షలు నేటికీ నెరవేరలేదన్నారు. వారి ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ డివిజన్ నాయకురాలు మరుకుర్తి వీరలక్ష్మి, తామర్ల గౌరి, నక్కాలక్ష్మి, గొన్నూరి అరవాలమ్మ, తోటకూర బేబి, మార్గాని సత్యవతి, అనంతలక్ష్మి, జగదాండ, కృష్ణవేణి పాల్గొన్నారు.

కడియం: కడియం దేవీచౌక్ సెంటర్‌లో శనివారం భగత్‌సింగ్ సేవాసంస్థ అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయవాది తోరాటి వసంతరావు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మద్రి సుబ్రహ్మణ్యం, కళ్యాణ సూరిబాబు చిలుకూరి నాగేశ్వరరావు, నందం వీరబాబు, చల్లా అంజిబాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్ : భారత స్వాతంత్ర్యం కోసం అసమాన పోరాటం చేసిన విప్లవకారుడు భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి సీపీఐ సీనియర్ నాయకుడు నల్లా రామారావు, భ్రమరాంబ దంపతులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యకోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను స్మరించుకుని జయంతి, వర్ధంతులను నిర్వహించేందుకు భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన రామారావు దంపతులు అభినందనీయులన్నారు. కార్యక్రమంలో అల్లంకి మణికంఠ, కేబుల్ శ్రీనివాస్, మదీనా భాషా, రాజు, డి.బ్రహ్మాజీ, శ్రీనివాస్, కె.ప్రసాద్ పాల్గొన్నారు.



రాజానగరంలో రాజుగురు సుఖదేవుల చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న ఏఐకెఎంఎస్

ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్లకు
నెలాఖరు వరకు గడువు పొడిగింపు

రంగంపేట, మార్చి 23: ఆర్టీఈ ప్రకారం ఒకటో తరగతిలో అడ్మిషన్లకు ఈనెల 31 వరకు పొడిగించినట్టు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారని రంగంపేట ఎంఈవో కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం-2009 సెక్షన్ 12(1) ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న పిల్లలు బీసీ. మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు ఒకటో తరగతిలో ప్రవేశం పొందడానికి ఈనెల 25తో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగియడంతో అధిక సంఖ్యలో విద్యార్థులకు అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో ఈనెల 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు సమగ్ర శిక్షా పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారని ఆయన చెప్పారు.

అయ్యో.. భీమ్ చనిపోయావా..

● శునకం మృతితో కన్నీటిపర్యంతం.. దశ దిన కర్మ


శునకాన్ని గుండెలకు హత్తుకొని విలపిస్తున్న నూతన్

గోకవరం, మార్చి 23: మూగజీవాలను మనుషులు ప్రేమిస్తున్నారు.. ఎంతలా అంటే మనుషులకంటే ఎక్కువగా.. గతంలో ఏదైనా కుక్క చనిపోతే ఎక్కడో ఒక చోట పడవేసేవారు. ప్రస్తుతం అలా కాదు.. చనిపోయిన పెంపుడు కుక్కకోసం ఏడ్చి ఏడ్చి.. దశదిన కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సంఘటన అటువంటిదే. గోకవరం మండలం పెంటపల్లి గ్రామానికి చెందిన పెనుగుల నూతన్ గత ఆరేళ్లుగా ఓ శునకాన్ని (భీమ్) పెంచుకుంటున్నాడు. ఆ పెంపుడు శునకం ఈనెల 21వ తేదీన అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గుండెలవిసేలా విలపించారు. శునకం మృతి చెందిన సమయంలో నూతన్ హైదరాబాద్‌లో ఉండడంతో అతను వచ్చే వరకు కడసారి చూపునకు కుక్కను ఒక్కరోజంతా(22వ తేదీవరకు) ఐస్ బాక్స్‌లో ఉంచారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి చేరుకున్న నూతన్.. కుక్క (భీమ్)ను గుండెలకు హత్తుకొని విలపించడం చూపరులను కలిచివేసింది. నూతన్ కుటుంబ సభ్యులు వచ్చేవరకు ఆ శునకాన్ని ఇంటి ఆవరణలోనే ఉంచారు. అప్పటివరకు ఏ ఒక్కరూ ఆహార పానీయాలను దరి చేరనీయలేదు. కుటుంబ సభ్యులందరూ వచ్చి భీమ్ కళేబరాన్ని చివరిచూపు చూశాక అంతిమ యాత్ర చేశారు. తరువాత శ్మశాన వాటికలో శునకం కళేబరాన్ని ఖననం చేశారు. శనివారం గ్రామంలోని వందమందికి భోజనాలు పెట్టి దశదిన కర్మక్రియలు పూర్తి చేశారు.

కోడిపందాలపై దాడి : నలుగురి అరెస్టు

కడియం, మార్చి 23: మురమండలో కోడిపందాలు ఆడుతున్న నలుగురిని పట్టుకున్నామని, కొంతమంది పారిపోయారని సీఐ బి.తులసీధర్ తెలిపారు. ఎస్ఐ కృష్ణసాయి, పోలీసు బృందంతో కలిసి కోడి పందాలపై దాడి చేశామన్నారు. వారి నుంచి 6,140 నగదు, మూడు కోడిపుంజులు, రెండు కోడికత్తులు, పది ద్విచక్రవాహనాలను స్వాధీనంచేసుకుని కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

అనపర్తి, మార్చి 23 : అనపర్తి మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలలో శనివారం జిల్లా పరీక్షల నిర్వహణ పరిశీలకులు డి.మధుసూదనరావు తనిఖీ చేశారు. మండలంలోని అనపర్తిలో రామారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల, జీబీఆర్ పాఠశాల, కుతుకులూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు సిబ్బంది కృషి చేయాలని మాల్ ప్రాక్టీసుకు తావులేకుండా పరీక్షల నిర్వహణ జరగాలి అయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, సీఎస్ కె.సత్యారెడ్డి, డీవో జయ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పది పరీక్షలకు 36 మంది గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 23: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు శనివారం జరిగిన ఫిజికల్ సైన్సు పరీక్షకు 36 మంది విద్యార్థులు హాజరుకాలేదని ఎంఈవో-2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. 772 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా బిక్కవోలు సెంటర్‌లో పన్నెండు మంది, ఇళ్లపల్లిలో ఏడుగురు, బలభద్రపురంలో ముగ్గురు, పందలపాక బి సెంటర్‌లో 14 మంది హాజరుకాలేదన్నారు.

రంగంపేటలో 27 మంది గైర్హాజరు

రంగంపేట: రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో శనివారం ఐదవ రోజు నిర్వహించిన పి.ఎస్. పరీక్షకు 654 మంది విద్యార్థులకుగాను 627 మంది విద్యార్థులు హాజరుకాగా 27 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు.

చిన్నారి వైద్య ఖర్చులకు సాయం అందజేత



అనపర్తి, మార్చి 23: మండలంలోని మహేంద్రవాడ గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి లంక గౌతమ్ బ్రెయిన్ ట్యూమర్‌తో చికిత్స పొందుతున్నాడు. వైద్యం ఖరీదు కావడంతో పేద కుటుంబం కావడంతో వారు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన శ్రీ కాశీఅన్నపూర్ణదేవి సేవాసంస్థ ప్రతినిధులు చిన్నారి వైద్యం కోసం రూ.23వేలు శనివారం చిన్నారి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారి వైద్యంకోసం ఒక్కొక్క ఇంజక్షన్ రూ.80వేలు వెచ్చించాల్సి వస్తోందని కడు పేద రికంలో ఉన్న ఈ కుటుంబం వైద్యం చేయించలేక పడుతున్న ఇబ్బందులను గమనించి వారికి సహాయం అందజేశామన్నారు. మరింతమంది దాతలు ముందుకు రావాలని సేవా సంస్థ ప్రతినిధులు కోరుతున్నారు.

శక్తిగౌరిగా దర్శనమిచ్చిన
పాత సోమాలమ్మ



రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 23:రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ జాతర ఉత్సవాలు శనివారం 4వ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు శక్తిగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులతో సౌభాగ్యవ్రతం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ తెలిపారు. అమ్మవారిని రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, ఇన్నీసుపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు, మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ రెడ్డి శేషగిరిరావు దర్శించుకున్నారు.

అంగన్వాడీకి వేరుగా వంటశాల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీకి వేరుగా వంటశాలను కేటాయించారు. లాలాచెరువు సమీపంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ పిల్లలకు ఆహారాన్ని ఒకే చిన్నగదిలో రెండు గ్యాస్ సిలిండర్లు పక్కపక్క పెట్టి వండుతుండడం ప్రమాదమంటూ 'ఇంత నిర్లక్ష్యమా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు ఆదేశాలతో అర్బన్ ఎంఈవో దిలీప్ కుమార్ ఆ స్కూలు వద్దకు చేరుకొని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వేరొక గదిలోని పనికిరాని వస్తువులను తీయించి అంగన్వాడీ పిల్లల వంటకోసం కేటాయించారు. దీంతో అధికారులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ అష్టలక్ష్మి జన్మనక్షత్ర మహోత్సవ ఆహ్వానం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 23: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్ వంకాయల వారి వీధిలో అష్టలక్ష్మి సహిత శ్రీలక్ష్మి నారాయణస్వామి ఆలయంలో అష్టలక్ష్మి అమ్మవారి జన్మ నక్షత్ర మహోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ గుర్రం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సామూహిక కుంకుమార్చనలో అఖండ సౌభాగ్యం, పరిపూర్ణ ఆరోగ్యం, శీఘ్ర సంతాన, వివాహ ప్రాప్తి, సుఖశాంతులు కోరుకునే భక్తులు పాల్గొనవచ్చని చెప్పారు.

రంజాన్ కిట్లు పంపిణీ


ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న కంటిపూడి కిరణ్

కడియం, మార్చి 23: కడియం మండలం దుళ్ళ గ్రామానికి చెందిన సామాజికవేత్త కంటిపూడి కిరణ్ దుళ్ళలో 30మంది ముస్లిం కుటుంబాలకు రూ.15వేల విలువైన రంజాన్ కిట్లను అందజేశారు. గోధుమ, చక్కెర, నెయ్యి, సేమియా ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గత మూడేళ్ళుగా కంటిపూడి కిరణ్ గ్రామం లో ముస్లిం సోదరులకు రంజాన్‌కిట్లు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. కిరణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. తోకల శ్రీనివాసరావు, గుర్రపు సత్యనారాయణ, ఈదర నందబ్బు, చిట్టూరి వెంకన్నచౌదరి, షేక్ సత్తార్, షేక్ మీరయ్య, షేక్ సిద్దామీరయ్య, షేక్ మీరాసాహెబ్, షేక్ సుభాన్, మాబూ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

అనపర్తి, మార్చి 23 : అనపర్తిలోని జీబీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు మండలంలోని పీరా రామచంద్రపురంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు పశువైద్యుడు రామచంద్రారెడ్డి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పశువులలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌పి అబ్బాయిరెడ్డి ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆనందరావు, సుధారాణి, వెటర్నరీ అసిస్టెంటు బి.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	సా.6.23
సహరి(సోమ)	ఉ.4.42

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	38.0	23.0

నో

విజిట్రబుల్స్

దిగొచ్చిన కూరల ధర

కిలో రూ.20లోపే పలు రకాలు

బహిరంగ మార్కెట్లో దోపిడీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 23 : కూరగాయల ధరలు దిగొచ్చాయి.. ఎన్నికల మహత్యమో.. పంట దిగుబడి పెరిగిందో తెలియదు కానీ అందరికీ అందుబాటు ధరల్లో లభ్యమవు తున్నాయి. దాదాపు అన్ని రకాల కూరగాయలు రైతు బజార్లలో చౌకగా దొరుకుతున్నాయి. దీంతో సాధారణ, మధ్యతరగతి కొనుగోలుదారుల్లో కొంత ఆనందం కనిపిస్తోంది. నిన్నమొన్నటి వరకూ కిలో రూ.50ల పైనే ధర పలికే దొమ్మేరు వంకాయలు ప్రస్తుతం కిలో రూ.24లకే లభించడం విశేషం. దొండకాయలు లోకల్ కిలో రూ.15లకే అమ్ముతున్నారు. రైతుబజార్లలో టమాటా కిలో రూ.14, వంకాయలు నలుపు రూ.18, వంకాయలు తెలుపు చార, గులాబీ రూ.18, బెండకాయలు రూ.22, పచ్చిమిర్చి రూ.26, కాకరకాయలు రూ.24, బీరకాయలు రూ.26, దొండకాయలు రూ.15, గోరుచిక్కుళ్లు రూ.30, దోసకాయలు రూ.12, ఆనబకాయ రూ.12, అరటికాయ రూ.7, మునగకాయ రూ.5, బొబ్బర్లు రూ.20, మామిడికాయ రూ.7 ఇలా దాదాపు కూరగాయలన్నీ దిగివచ్చాయి. కేరట్, బీట్రూట్, కీరదోస బంగాళాదుంపలు ధరలు కూడా చాలా వరకూ తగ్గాయి. కేరట్ కిలో రూ.28, బీట్రూట్ రూ.28, బంగాళాదుంపలు రూ.24లు ధర ఉంది. క్యాప్సికం, పెండల ం, చేమదుంపలు, బీన్స్‌కాయలు, బీన్స్ గింజలు, చిక్కుళ్లు ధరలు కాస్త ఎక్కువగానే ఉన్నా సాధారణ ప్రజానీకం చాలామంది పెద్దగా వీటిని వినియోగించే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బంది పడే పరిస్థితులు లేవనేచెప్పాలి.

మార్కెట్ మాయాజాలం..

బహిరంగ మార్కెట్ మాయాజాలం ఎప్పటిలానే కొనసాగుతోంది. బహిరంగ, చిల్లర మార్కెట్లలో దోపిడీ యథాతథంగా సాగుతోంది. బహిరంగ మార్కెట్లో దొమ్మేరు వంకాయలు కిలో రూ.50ల వరకూ అమ్ముతున్నారు. టమాటా రూ.30లు, మిర్చి 40, బీరకాయలు రూ.50, దొండకాయలు రూ.30, బెండకాయలు రూ.30 ఇలా బహిరంగ మార్కెట్లలో అన్ని కూరగాయల ధరల బాదుడు కొనసాగుతోంది. కేజీకి సుమారు రూ.15లుపైనే వేసుకుని విక్రయిస్తున్నారు.





సైకిల్ స్పీడు

సైకిల్ స్పీడు పెంచింది.. అభ్యర్థుల ప్రకటన ముగియడంతో ఎన్నికలపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా శనివారం విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు, అబ్జర్వర్లతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొడ్డు వెంకట రమణ చౌదరి(రాజానగరం), బూరుగుపల్లి శేషారావు(నిడదవోలు), ఆదిరెడ్డి శ్రీనివాస్(రాజమహేంద్రవరం), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి(అనపర్తి), రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మద్దిపాటి వెంకటరాజు(గోపాలపురం) హాజరయ్యారు. ఎన్నికల్లో అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత

సజావుగా ఎన్నికల నిర్వహణకు కమిటీ

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

- ఎన్నికల ఫిర్యాదులకు డయల్ 1800-425-2540

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: సహృదయ వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే.మాధవీలత అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం మోడల్ ప్రవర్తనా నియమావళి ఫిర్యాదులపై జిల్లా స్థాయి ప్రమాణిక కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. జాతీయ,రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఏడుగురు జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు చెందిన వారిని నియమించామన్నారు. పట్నాల విజయకుమార్(బీఎస్పీ), బొమ్ముల దత్తు(బీజేపీ), మన్నవ రఘురాం(ఆమ్‌ఆద్మీపార్టీ), పి.అరుణ్ కిరణ్(కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎం), అరిగెల అరుణకుమారి(కాంగ్రెస్), కేఎస్ జవహర్(టీడీపీ), జక్కంపూడి రాజా(వైసీపీ) కమిటీని వేశామన్నారు. ప్రకృతి విపత్తులు,ఇతర అత్యవసర పరిస్థితుల్లో కమిటీ నిర్ణయం మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల ఫిర్యాదులు నమోదుకు జిల్లాలో టోల్ ఫ్రీనెంబరు 1800-425-2540 కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ టోల్‌ఫ్రీ నెంబరు 1950 అందుబాటులో ఉందన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లో స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, సభ్యులు కన్వీనర్ బి.బాలస్వామి, సభ్యులు పి.ప్రదీప్ కుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులు పట్నాల విజయకుమార్, సీహెచ్.మణికృష్ణ, బి.రామచంద్రరావు, అరిగెల అరుణకుమారి, గెడ్డం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కట్టేయ్.. అడిగేదెవరు!




పేదోడు ఇల్లు కట్టుకోవాలంటే సవాలక్ష నిబంధనలు.. పంచాయతీలో ఇంటి ప్లాన్‌కు అనుమతి కావాలంటే అన్నీ ఉన్నా.. అర్హత ఉన్నా.. ఏదో ఒక మెలిక పెడతారు.. కాళ్లరిగేలా తిరగాలి లేదంటే మామూళ్లు చెల్లించుకోవాలి.. అదే పెద్దోళ్లు అయితే అసలు అనుమతుల ఊసే లేదు.. అక్రమంగా అయినా సక్రమంగా కట్టేసుకోవచ్చు. అనుకున్నది చేసేసుకో వచ్చు. అడిగేవాడుండడు.. ఆపేవాడుండడు.. ఈ రెండు సంఘటనలే అందుకు ఉదాహరణ.. అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నా కనీసం కన్నెత్తి చూసిన అధికారులే లేరు.. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమంగా కట్టేస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఆపలేక చోద్యం చూస్తున్నారు..

- అక్రమంగా భవన నిర్మాణాలు
- నేతల అండదండలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- యథేచ్ఛగా అనుమతులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు



రుడా అనుమతి లేకుండా పంచాయతీ ప్లాన్‌తో నిర్మించి భవనం



బొమ్మూరు పంచాయతీ ఇచ్చిన కమర్షియల్ ప్లాన్



నిడదవోలు మండలం తాడిమళ్ళలో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్ భవనం

మేముండగా.. రుడా ఎందుకు?

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 23 : అంతా మా ఇష్టం.. అడిగేదెవడ్రా మా ఇష్టం.. అంటూ నిబంధనలు పక్కన పెట్టి మరీ ప్లాన్ అప్రూవల్స్ యథేచ్ఛగా మంజూరు చేస్తున్నారు. సాధారణంగా పంచాయతీ పరిధిలో 300 స్క్వేర్ మీటర్ల స్థలంలో జి+2 వరకు అనుమతులు మంజూరు చేసే అధికారం ఉంటుంది. అదీ కూడా నివాసయోగ్యానికి (రెసిడెన్షియల్) మాత్రమే. వ్యాపార సముదాయాలకు సంబంధించి రుడా అనుమతులు తప్పనిసరి. రుడా లైసెన్స్‌డ్ సర్వేయర్లు మాత్రమే ప్లాన్ గీసి సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దానికి అనుగుణంగా పంచాయతీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్లాన్ అప్రూవల్స్ మంజూరు చేస్తారు. అయితే ఇక్కడ అలాలేదు. సర్వేయర్లు అంతా తామే చూసుకుంటాం అంటూ భవన యజయానుల నుంచి సొమ్ములకు కక్కుర్తి పడి కమర్షియల్ ప్లాన్‌లకు పంచాయతీ అప్రూవల్స్ ఇప్పించేస్తున్నారు. ఇదే అదునుగా భవన యజమానులు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఫంక్షన్ హాల్స్ నిర్మించి సొమ్ములు చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు సెంటరు నుంచి బాలాజీపేట సెంటరుకు వెళ్ళే ప్రధాన రహదారిలో ఆర్ఎస్ నంబరు 56-1లో రుడా లైసెన్స్‌డ్ సర్వేయర్ మాణిక్యాలరావు వ్యాపార సముదాయం(కమర్షియల్ ప్లాన్) బొమ్మూరు పంచాయతీకి ప్లాన్ మంజూరుకు అప్‌లోడ్ చేశారు. దీనిని పంచాయతీ కార్యదర్శి డిజిటల్ సైన్ చేసి మంజూరు చేశారు. దీంతో భవన యజమాని షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు ఫంక్షన్‌హాల్ కూడా నిర్మించారు. ఈ ప్లాన్ అప్రూవల్ మంజూరు విషయంలో పెద్ద మొత్తంలో చేతులు మారాయంటూ విమర్శలు ఉన్నాయి. మరొక విషయం ఏమిటంటే ఈ కాంప్లెక్స్‌కు పన్ను మదింపు చకచకా వేసేశారు. మచ్చుకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రూరల్ మండల పరిధిలోని 10 గ్రామాల్లో అనధికారికంగా నిర్మించిన భవనాలతో పాటు, ప్లాన్లు డీవియేట్ చేసి నిర్మించిన భవనాలు వందల సంఖ్యలో ఉన్నాయంటే అధికారుల పనితీరు అర్థం చేసుకోవచ్చు. గ్రామాల ప్రత్యేకాధికారులు మారుతున్నారు గాని క్షేత్రస్థాయిలో అవినీతి కట్టడి చేయలేకపోతున్నారు.

పొరపాటున ప్లాన్ ఇచ్చాం..

మాకు కమర్షియల్ ప్లాన్లు మంజూరు చేసే అధికారం లేదు.పొరపాటున ఇచ్చాం. సంబంధిత ప్లాన్‌లపై ఫిర్యాదు చేస్తాం. అవసరమైతే ప్లాన్ కూడా రద్దు చేస్తాం.

- శ్రీనివాసరెడ్డి, బొమ్మూరు కార్యదర్శి

రుడా ఉండగా.. మీరెందుకు!

నిడదవోలు, మార్చి 23 : గ్రామంలో ఎక్కడైనా ఇల్లు కట్టుకోవాలంటే అధికారుల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయాల్సిందే. అలాంటిది వ్యాపార సంస్థ కోసమో లేక పరిశ్రమ కోసమో ఒక భారీ నిర్మాణం చేపట్టాలంటే నిబంధనలు అన్నీ సక్రమంగా ఉన్నా అధికారులను ప్రసన్నం చేసుకోకపోతే అడుగు కూడా ముందుకు పడదు. అలాంటిది ఒక వైసీపీ నేత అండదండలతో పంచాయతీ అధికారులకు మామూళ్లు అందడంతో నిబంధనలకు నీళ్లొదిలేసి భారీ నిర్మాణం యథేచ్ఛగా సాగుతోంది. బహిరంగంగానే ఈ నిర్మాణం సాగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. నిడదవోలు మండలం తాడిమళ్ళ గ్రామ పరిధిలో గత ఏడు నెల లుగా ఒక భారీ నిర్మాణం యథేచ్ఛగా సాగుతుంది. పంచాయతీ పరిధిలో ఒక పరిశ్రమకు గాని, వ్యాపార సంస్థకు చెందిన గొడౌనుకు గాని నిర్మాణం జరగాలి అంటే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) నుంచి అనుమతులు మంజూ రవుతాయి.ఈ అనుమతులు మంజూరు కావడానికి ముందుగా గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి ఆ వ్యాపార సంస్థకు సంబంధించిన పరిశ్రమపై చర్చించి అనంతరం పంచాయితీ కార్యదర్శి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) మంజూరు చేయాలి. అంతే కాకుండా అగ్నిమాపక శాఖ కార్యాలయం నుంచి కూడా ఎన్‌వోసీ మంజూరు చేయాలి. అప్పుడు రుడా స్థల పరిశీలన చేసి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తుంది. వ్యాపార సంస్థ లేక పరిశ్రమ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమవుతాయి. పంచాయతీ అనుమతి లేకుండా సుమారు ఆరు నెలలకు పైగానే ఆ భారీ నిర్మాణం సాగుతున్నా అటు వైపు కన్నెత్తి చూసిన పంచాయతీ అధికారులే లేరు. అనుమతులకు విరుద్ధం గా సాగుతున్న నిర్మాణాలపైపు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిడదవోలు మండల, పట్టణంలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నా పట్టించుకునే వారే లేరు.

పంచాయతీ అనుమతి లేదు..

తాడిమళ్ళలో గత ఏడు నెలలుగా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం జరుగుతుంది. కొద్ది రోజుల కిందటే ఆ నిర్మాణానికి సంబంధించిన గుమస్తా వచ్చి ల్యాండ్ కన్వర్షన్, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ఇచ్చిన ప్రొసీడింగ్స్ కాపీలు అందజేశాడు.నిర్మాణానికి సంబంధించి ఎటువంటి పత్రాలు పంచాయతీకి సమర్పించలేదు. పంచా యతీ నుంచి ఎటువంటి ఎన్‌వోసీ ఇవ్వలేదు.

- టి.గోపాలకృష్ణ, తాడిమళ్ళ కార్యదర్శి

అంతా ఓకే!

- కోనసీమ జిల్లా పి.గన్నవరంలో రాజకీయ ఉత్కంఠకు తెర
- జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధికారిక ప్రకటన
- జోష్‌లో ఉన్న గన్నవరం నియోజకవర్గ కూటమి శ్రేణులు
- ఉమ్మడి తూర్పుగోదావరిలో అన్ని సీట్లకు అభ్యర్థులు ఖరారు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా రాజకీయపరంగా ఉత్కంఠ రేపిన పి.గన్నవరం రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన పోటీ చేస్తున్నట్టు ప్రకటించింది. స్వయంగా జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణే ఈ ప్రకటన చేశారు. నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును శనివారం ప్రకటించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తొలి విడత జాబితాలో పి.గన్నవరం స్థానానికి టీడీపీ అభ్యర్థిగా సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. అయితే రాజేష్ అభ్యర్థిత్వం పట్ల వ్యక్తమైన అభిప్రాయాలను దృష్టిలో ఉంచుకుని మార్పు అనివార్యమైంది. టీడీపీ ఖాతాలో ఉన్న ఈ సీటు వ్యూహాత్మకంగా జనసేనకు దక్కింది. టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేష్ యూట్యూబ్ చానల్‌లో గతంలో టీడీపీ, జనసేన, హిందూ కులాలకు వ్యతిరేకంగా చేసిన వీడియోల నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వాన్ని నియోజకవర్గ ప్రజలు, ఆయా పార్టీల కేడర్ వ్యతిరేకించడంతో గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీకి నష్టం కలగకూడదనే సదుద్దేశంతో మహాసేన రాజేష్ స్వచ్ఛందంగా తానే గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిత్వం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటన చేశారు. పార్టీ ఆదేశాలతో సంబంధం లేకుండా టీడీపీకి నష్టం కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన స్వచ్ఛంద ప్రకటన సారాంశం. అయితే తరువాత తన నిర్ణయం పట్ల పార్టీ నుంచి ఎటువంటి స్పందన వెలువడకపోవడంతో మళ్లీ పోటీ చేసేందుకు రాజేష్ సిద్ధంగా ఉన్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య పి.గన్నవరం అభ్యర్థిత్వం ఆటలాడుకుందనే చెప్పాలి. ఆయా పార్టీలకు చెందినవారు ఆ నియోజకవర్గం నుంచి తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని ప్రకటనలు ఇస్తూ నియోజకవర్గ ఓటర్లను గందరగోళంలో ముంచెత్తారు. టీడీపీ నుంచి కొందరు. బీజేపీ నుంచి టీఎస్ఎన్ మూర్తి, మానేపల్లి అయ్యాజీవేమాల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు కూడా సోషల్ మీడియాలో ప్రచారం హోరెత్తింది. అయితే గన్నవరం సీటు పైనే ఆశలు పెట్టుకుని పోలీసు శాఖలో చేస్తున్న ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణచేసి జనసేనలో చేరిన గిడ్డి సత్యనారాయణ పట్టువదలని విక్రమార్కుడిలా తన ప్రయత్నాన్ని కొనసాగించడంతో చివరకు విజయం సాధించారు. టీడీపీ స్థానంలో జనసేన నుంచి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల బరిలోకి దిగుతున్నారని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ శనివారం చేసిన ప్రకటనతో ఈ నియోజకవర్గంపై అటు టీడీపీ, ఇటు బీజేపీలో నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. దాంతో జనసేన కేడర్‌లో ఆనందం పెల్లుబికుతోంది. పైగా నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న జనసేన విజేతల సమాచారాన్ని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తం చేయడంతోపాటు వారు పార్టీ కోసం చేస్తున్న కృషిని దృష్టిలో పెట్టుకుని గన్నవరం స్థానం నుంచి జనసేన అభ్యర్థిని పోటీలోకి పెడుతున్నామని, మీరంతా కష్టపడి పనిచేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మొత్తం మీద తొలి జాబితాలో టీడీపీ ప్రకటించిన స్థానాన్ని జిల్లాలో చిట్టచివరి స్థానంగా జనసేన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ క్రమంలో అభ్యర్థుల బలాబలాలపై తాజా చర్చ మొదలైంది.



పి.గన్నవరం అభ్యర్థి గిడ్డికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న పవన్

పి.గన్నవరాన్ని పవన్‌కల్యాణ్‌కు గిఫ్ట్‌గా అందిస్తా

- జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సహకారంతో పి.గన్నవరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించి జనసేనాని పవన్‌కల్యాణ్ గిఫ్ట్‌గా అందిస్తా. నామీద నమ్మకంతో సీటు కేటాయించిన పవన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. జనసేన అధినేత ఆశయాలతో నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరిస్తూ ప్రతి నిరుపేదకు అండగా నిలుస్తాను. నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తాను.

అభ్యర్థి వివరాలివీ..

గిడ్డి సత్యనారాయణ స్వగ్రామం పి గన్నవరం మండలం ఊడిమూడి శివారు ఊడిమూడిలంక. బీఏ, బీఎల్ చదువుకున్న ఆయన హైదరాబాదు సిటీ కమిషనర్ కార్యాలయంలో 20 ఏళ్లుగా అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవలే తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. విద్యార్థి దశలోనే రాజకీయపరంగా 1989లో తెలుగు యువత జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ఇటీవల జనసేనలో చేరిన ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా నియోజకవర్గంలో పలు సామాజిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి ప్రాంతంలోని అన్ని సీట్లకు అభ్యర్థులను టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించింది. తొలి సీటును మండపేట నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించారు. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును తమ అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజానగరం నుంచి తమ పార్టీ పోటీ చేస్తున్నట్టు తొలిసారిగా ప్రకటించారు. ఆ తర్వాత విడతల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తూ రాగా చివరిగా శనివారం పి.గన్నవరం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను పవన్ ప్రకటించడంతో అన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్టు అయింది. ఇక పూర్వపు తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 19 అసెంబ్లీ సీట్లు ఉండగా, విభజిత తూర్పుగోదావరి జిల్లాలో పశ్చిమగోదావరి నుంచి కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం సీట్లు వచ్చి చేరాయి. అంటే రంపచోడవరంతో కలిపి 22 సీట్లు అయ్యాయి.

మొత్తం అసెంబ్లీ సీట్లు : 22

ఉమ్మడిగా సీట్ల పంపకం..

తెలుగుదేశం : 16, జనసేన : 6

28 నుంచి దివ్యాంగులకు సదరం శిబిరాలు

రాజమహేంద్రవరం సిటీ,మార్చి 23: జిల్లాలో కొవ్వూరు-రాజమహేంద్రవరం డివిజన్లలో ఈనెల 28 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు దివ్యాంగుల వైకల్య నిర్ధారణ పరీక్షా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సమగ్రశిక్షా జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి తెలిపారు. దివ్యాంగుల వైకల్యం నిర్ధారణకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాలుగు చోట్ల మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైక్యల నిర్ధారణ జరిగిన తర్వాత అవసరమైన ఉపకరణాలు అందజేస్తారని చెప్పారు. ఈ శిబిరాల వద్ద పిల్లలకు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశామని.. అలాగే రవాణా ఖర్చులు ఇస్తామని తెలిపారు. 28న కొవ్వూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని నల్లజర్ల, గోపాలపురం, తాళ్ళపూడి, దేవరపల్లి,కొవ్వూరు ప్రజలు వినియోగించుకోవాలన్నారు. 30న రాజమహేంద్రవరం ఎస్‌కేవీటి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని కడియం, అనపర్తి, బిక్కవోలు, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ మండలాలకు చెందిన దివ్యాంగులు వినియోగించుకోవాలన్నారు. వచ్చే నెల 1న నిడదవోలు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శిబిరాన్ని పెరవలి, ఉండ్రాజవరం, చాగల్లు, నిడదవోలు దివ్యాంగులు, వచ్చే నెల 3న కోరుకొండ గవర్నమెంట్ హైస్కూల్‌లో జరిగే శిబిరాన్ని సీతానగరం, రాజానగరం, గోకవరం, రంగంపేట, కోరుకొండ ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సీఎస్ సమీక్షలో కలెక్టర్ మాధవీలత

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

51 హాబిటేషన్లలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 23: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ డాక్టర్ కే.మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్ రెడ్డి విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో ఉపాధి హామీ పనులు, తాగునీటి ఎద్దడి తదితర అంశాలపై నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. రానున్న వేసవిలో 51 హ్యాబిటేషన్స్ పరిధిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో కోరుకొండ, గోకవరం, సీతానగర, రాజానగరం, గోపాలపురం, రంగంపేట ప్రాంతాలు అప్ ల్యాండ్ కిందకు వస్తాయని చెప్పారు. జిల్లాలో 2023-24 ఆర్థిక ఏడాది కింద 52 లక్షల పని దినాలకు సుమారు 49 లక్షల పనిదినాలు లక్ష్యం సాధించినట్లు తెలిపారు. జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కోతలు ప్రారంభం అయ్యాయని మే రెండో వారం వరకు జరుగుతాయన్నారు.సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డ్వామా పీడీ ఏ.ముఖలింగం పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీరాముడికి తలంబ్రాల బియ్యం



నల్లజర్ల నుంచి భద్రాచలంకు బియ్యం తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల, మార్చి 24: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాల నిమిత్తం ఉభయగోదావరి జిల్లాల్లో రామభక్తుల నుంచి సేకరించిన ఐదు టన్నుల బియ్యాన్ని భద్రాచలం పంపించినట్టు శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి జంగారెడ్డిగూడెం సభ్యులు పేర్కొన్నారు. శనివారం నల్లజర్లలో జెండా ఊపి బియ్యం వాహనాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులకు శ్రీరాముని తలంబ్రాలు అందించే నిమిత్తం తాము ఈ కార్యక్రమం తలపెట్టినట్టు సభ్యులు పాతూరి పాపారావు, నవలం రామకృష్ణ, బిక్కిన శ్రీనివాసరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు చెప్పారు.

జవహర్‌కు కొవ్వూరు టిక్కెట్ కేటాయించాలి

కొవ్వూరు, మార్చి 23: కొవ్వూరు నియోజకవర్గంలో ప్రజాదరణ కలిగిన జవహర్‌కు టీడీపీ టిక్కెట్టు కేటాయించకపోవడం అన్యాయమని దళిత నాయకులు అన్నారు. శనివారం కొవ్వూరు నియోజకవర్గం నుంచి దళిత నాయకులు జవహర్ నివాసానికి చేరుకుని మద్దతు తెలిపారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్టు కేటాయింపుపై టీడీపీ అధినేత చంద్రబాబు పునరాలోచించాలన్నారు. జవహర్ వెంటే దళిత నాయకులంతా ఉన్నామన్నారు.

చాగల్లు శాఖాగ్రంథాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

చాగల్లు, మార్చి 23: చాగల్లు శాఖాగ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. అలాగే నెలటూరు పుస్తక పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడుతూ గ్రంథాలయాన్ని సందర్శించడం, పుస్తకాలు చదవడం ప్రతి విద్యార్థి అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం అందజేత

చాగల్లు, మార్చి 23: సేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలవడమే మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని ట్రస్టు ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. శనివారం మండలంలోని చంద్రవరంలో పేదలకు నాణ్యమైన బియ్యంను 15 కేజీల వంతున 15 కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిపాటి శ్రీరామ్మూర్తి, కోదండరావు శ్రీనివాస్, బండి అశోక్, బండి సత్యనారాయణ, కె.వీర్రాజు, చక్రవర్తి, సంతోష్ పాల్గొన్నారు.

దొండపూడిలో చలివేంద్రం ఏర్పాటు



దొండపూడిలో చలివేంద్రాన్ని ప్రారంభించిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

గోపాలపురం, మార్చి 23: ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు అన్నారు. మండలంలోని దొండపూడి ప్రధాన సెంటర్‌లో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు శనివారం చేశారు. ఈ సందర్భంగా మొదటి రోజు బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ చలివేంద్రానికి వ్యాపారస్తులు 25కూలింగ్ క్యాన్‌లను బహూకరించారు. కార్యక్రమంలో ముత్యాలరాయుడు, బండారు గనిరాజు, పోతిరెడ్డి నాగరాజు, వెల్లంకి జయశివసూర్యం, మారాజు రాజేష్, నున్నా అనంత మణికుమార్, కొప్పన ప్రసాద్, మధు, రమాకాంత్ పాల్గొన్నారు.

టీడీపీ వర్క్‌షాప్‌లో బూరుగుపల్లి

నిడదవోలు, మార్చి 23: టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం విజయవాడలోని ఎ1 కన్వెన్షన్ హాలులో పార్టీ అసెంబ్లీ అభ్యర్థులు, ఇన్‌చార్జిల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు హాజరయ్యారు. టీడీపీ ఎన్నికల వ్యూహం అభ్యర్థులకు వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఆయన చెప్పారు.

'పది' ఫిజిక్స్ పరీక్షకు 125 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 23: కొవ్వూరు పట్టణ, మండలంలో పదో తరగతి ఫిజికల్ సైన్సు పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 పరీక్షా సెంటర్లలో 1562 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా 1437 మంది హాజరయ్యారని, 125 మంది గైర్హాజరయ్యారని డీవైఈవో కె.వాసుదేవరావు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



యర్నగూడెంలో కలశపూజ హోమం నిర్వహిస్తున్న దంపతులు

దేవరపల్లి, మార్చి 23: మండలంలోని యర్నగూడెంలో అలివేలు మంగా, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద విశ్వక్సేన పుణ్యాహవాసనం, పంచగవ్యార్చన, అగ్నిమథనం, అక్షరహోమం, మూలమంత్ర, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ సంఘం పిఠాపురపు కాశీవిశ్వనాథం రోహిణి దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నిర్వాహకుడు రావిపాటి వరప్రసాద్, వేద పండితులు పూజా కార్యక్రమాలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళపు వెంకటనరసింహారావు, సుశీల దంపతులు, తీగల బలరామయ్య, బళ్ళా సూర్యచక్రం, నరహరశెట్టి సుధాకర్, పుట్టా వీరస్వామి, బళ్లా రవికుమార్ పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడిని కలిసిన ముప్పిడి



అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మార్చి 23: టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడిని కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడ ఏ కన్వెన్షన్ హాలులో జరిగిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహం-అభ్యర్థుల వర్క్‌షాప్‌నకు హాజరయిన వెంకటేశ్వరరావు.. కొవ్వూరు ఉమ్మడి అభ్యర్థిగా తనను ఎంపిక చేయడంపై ఆయనకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందరినీ కలుపుకుని అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని సూచించారన్నారు.

నేడు గోదావరిమాతకు నీరాజనం

కొవ్వూరు, మార్చి 23: ఫాల్గుణ పూర్ణిమ సందర్భంగా ఆదివారం అఖండ గోదావరిమాతకు మహా నీరాజనం అందజేస్తున్నట్టు కొవ్వూరు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు తెలిపారు. ఆదివారం ప్రదోషకాలంలో స్థానిక గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో గోదావరిమాతకు మహా నీరాజనం, మహిళలతో దీపోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

» ఐజేయూ జనరల్ సెక్రటరీ సోమసుందర్

» కొవ్వూరులో జర్నలిస్టుల జాతీయ కోర్కెల దినోత్సవం



కొవ్వూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పాత్రికేయులు

కొవ్వూరు, మార్చి 23: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పాత్రికేయులకు, మీడియా సంస్థలకు భద్రత కల్పించడానికి తీసుకొచ్చిన ప్రత్యేక చట్టాలను దేశవ్యాప్తంగా అమలుచేయాలని ఐజేయూ జనరల్ సెక్రటరీ దూసనపూడి సోమ సుందర్ అన్నారు. కొవ్వూరు ప్రెస్ రిపోర్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.ఎన్ బాబు ఆధ్వర్యంలో జర్నలిస్టుల జాతీయ కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్రెస్‌క్లబ్‌లో భగత్‌సింగ్ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని జర్నలిస్టుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమ సుందర్ మాట్లాడుతూ మీడియా స్థితిగతులను లోతుగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి తగు సిఫార్సులను చేసేందుకు మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రతకు జాతీయస్థాయిలో ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. దేశంలో వర్కింగ్, నాన్ జర్నలిస్టుల వేతనాలను సవరించేందుకు వేజ్‌బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులకు వృత్తిభద్రత, వేతన భద్రత కల్పించాలన్నారు. పాత్రికేయుల సమస్యలను ప్రెస్‌క్లబ్ నాయకులు గంధం పూజ్య నరసింహ బాపూజీ, గేదెల సత్యనారాయణ, వీరంశెట్టి రాజా వరప్రసాద్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కాగా జర్నలిస్టుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సబ్ కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ సూర్యప్రకాశరావు, తోట అవినాష్, గరగ వరప్రసాద్, శ్రీరంగం సత్యప్రసాద్, నండూరి వెంకటేశ్వరరావు, తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ సభ్యులు అప్పన రాజా, ఎం.సత్యనారాయణ, ఎ.చంద్రధర గుప్తా, జి.కోటేశ్వరరావు, చాగల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు కేవీవీఎస్ నారాయణ, జుట్టా కృష్ణమూర్తి, డి.వెంకట్రావు, వెంద్ర శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎంఎం సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రైతులతో వాట్సాప్ గ్రూప్‌లు పెట్టాలి

» ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు విజయాభినందన

దివాన్‌చెరువు, మార్చి 23: ఒక్కొక్క రైతుభరోసా కేంద్రం పరిధిలో ఐదుగురు అభ్యుదయ రైతులను గుర్తించి వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు బి.విజయాభినందన అన్నారు. వీఏఏల సహాయంతో వారికి సందేశాలను పంపాలని సూచించారు. దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రాన్ని మార్టేరు పరిశోధనా స్థానం అధిపతి డి.శ్రీనివాస్‌తో కలసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరువాక కేంద్రం ద్వారా ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని కాలానుగుణంగా రైతులకు చేరవేయడంలో కృతకృత్యులయ్యారన్నారు. భవిష్యత్‌లో ఇంకా మెరుగైన సేవలందించాలని సూచించారు. రైతులకు ఏరువాక కేంద్రం మరింత చేరువ కావాలంటే అనుసరించాల్సిన విధానాలను సూచించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో జిల్లాలో చాలా మంది రైతులు ప్రథమస్థానంలో ఉన్నారన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణా కార్యక్రమాల ద్వారాను, ఈ-విస్తరణ ద్వారాను రైతులకు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విజయాభినందనను ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్తలు అమ్మాజీ, హైమజ్యోతి సత్కరించారు.



విజయాభినందనను సత్కరిస్తున్న ఏరువాక జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

» నవయువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాషా

» భగత్‌సింగ్, రాజగురువు, సుఖదేవ్‌ల వర్ధంతి



గోపాలపురం: దొండపూడిలో ర్యాలీ చేస్తున్న పీడీఎస్‌వో, ఎన్‌వైఎస్ సభ్యులు

గోపాలపురం, మార్చి 23: భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశాన్ని తెగనమ్ముతున్న ప్రభుత్వరంగ సంస్థలను మూసివేస్తున్న పాలకుల విధానాలపై పోరాడాలని నవయువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాషా అన్నారు. భగత్‌సింగ్, రాజగురువు, సుఖదేవ్‌ల వర్ధంతిని పలుచోట్ల శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొండపూడిలో జరిగిన కార్యక్రమంలో వాళ్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ ప్రధాన సెంటర్‌లో భారీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 30లక్షల పోస్టులను, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 2,30,000 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద కంపెనీలకు కావల్సిన కారుచౌకగా కూలీలు దొరికే మార్కెట్‌గా భారతదేశాన్ని మలుస్తున్న పాలకుల విధానాలపై యువత పోరాడాలన్నారు. పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యను అందించే బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయని, అందులో భాగమే నూతన విద్యా విధానం-2020 అమలులోకి వచ్చిందన్నారు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగాన్ని కాపాడుకోవల్సిన కర్తవ్యం విద్యార్థులపై ఉందని మోహన్ అన్నారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు, త్యాజంపూడి గ్రామాల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, ప్రగతిశీల కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ భగత్‌సింగ్ బాల్యంలోనే స్వాతంత్ర్య ఉద్యమ భావాలు అలవరుచుకున్నారని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారి చరిత్ర తెలిసేలా పాఠ్యపుస్తకాలు ముద్రించాలన్నారు. కార్యక్రమంలో ఆకాష్, కె.సత్యనారాయణ, రామకృష్ణ, ఏడుకొండలు, ఉపాధ్యాయులు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులో సీపీఎం, భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ల వయస్సులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్ అని అన్నారు. 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ఉరితీయబడ్డారని, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్.రమేష్, టి.నాని, జి.భీమారావు, శేఖర్, బాలరాజు తదితర్లు పాల్గొన్నారు.



దేవరపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌కే మస్తాన్



నిడదవోలులో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గజ వాహనంపై విహరించిన లక్ష్మీనరసింహుడు

» కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు

» నాలుగో రోజు గజవాహనంపై నరసన్న గ్రామోత్సవం



లక్ష్మీనరసింహస్వామి

కోరుకొండ, మార్చి 23: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన శనివారం రాత్రి స్వామి వారు గజ వాహనంపై విహరించారు. ప్రతి రోజు సాయంత్రం జరిగే నిత్య హోమం, బలిహరణ, సేవాకాలం అనంతరం స్వామి వారిని గజవాహనంపై ఆశీనులను చేసి నాలుగు మాఢవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామికి పండ్లు, ఫలహారాలు సమర్పించి మంగళనీరాజనాలు అందించారు.



శ్రీ భూ సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవ దృశ్యం

వైభవంగా రంగనాథస్వామి కల్యాణోత్సవం

నరసన్న ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్థానిక రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అన్నవరం దేవస్థానం అధికారుల స్వీయ పర్యవేక్షణలో పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ ఆధ్వర్యంలో గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులైన ఎస్‌టీపీ వెంకటరమణాచార్యులు దంపతులతో ఈ కల్యాణ తంతు జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు కోరుకొండ, కాపవరం, పశ్చిమ గోనగూడెం, జంబుపట్నం, నర్సాపురం, శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.



గజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

కోరుకొండకు పోటెత్తిన భక్తులు

నరసన్న కల్యాణోత్సవాలు తిలకించేందుకు కోరుకొండకు భక్తులు పోటెత్తుతున్నారు. శనివారం కొండపైన, కొండ దిగువన సుమారు 30వేల మందికిపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరందరికీ స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతులు ధర్మసత్రంలో అన్నసమారాధన ఏర్పాటుచేసినట్టు సత్రం ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. అలాగే రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న విశిష్టాద్వైత పండిత సభలకు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. 4వ రోజున సభల్లో ఉభయ వేదాంత పండితులు కేతఈ స్వామి, పరాసర రఘునాథ భట్టర్‌స్వామి, పరాసర శ్రీవత్స చిన్నభట్టర్ స్వామి, ఇరగవపు కృష్ణామాచార్యులు ఉపన్యసించారు. రామాయణం, మహాభారత, భాగవత, బ్రహ్మసూత్రాలు, అళ్వారుల ప్రబంధంలోని విషయాలను వివరించారు. లక్ష్మీనరసింహస్వామి కళావేదికపై చిన్నారుల ప్రదర్శించిన భరతనాట్యం పలువురిని ఆకట్టుకుంది.



పండిత సదస్సుకి హాజరైన మహిళలు



రెడ్డి పంతుల సత్రం వద్ద భక్తుల కిటకిట

వ్యాపారులంటే ఎంపీ భరత్‌కు కక్ష : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న జానకిరామయ్య, రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: రాజమహేంద్రవరంలో వ్యాపారులపై ఎంపీ మార్గాని భరత్‌రామ్ కక్షగట్టారని టీడీపీ నగర ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకిరామయ్య, మజ్జి రాంబాబు, యిన్నమూరి రాంబాబు విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో తాము 22 రోజుల పాటు పర్యటించామని, వ్యాపారాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లోనే భరత్‌రామ్ రోడ్డు తవ్వేసి నెలల తరబడి అలాగే ఉంచేస్తున్నారన్నారు. తన 25శాతం కమిషన్ కోసం ఆయన ఏం చేయడానికైనా ఎవరిని ఇబ్బంది పెట్టడానికైనా సిద్ధమేనన్నారు. ఎంపీ భరత్ మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారని, అయితే ఆదిరెడ్డి వాసు ఆ ప్రాంతంలో పర్యటించిన సమయంలో స్థానిక వ్యాపారులు సెంట్రల్ లైటింగ్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని, తాము అధికారంలోకి వచ్చాక తొలగిస్తామని వాసు హామీ ఇవ్వడంతో రాత్రికి రాత్రే వాటిని ఎంపీ తొలగించాడని విమర్శించారు. నగరంలో ఏవీఏ రోడ్డు, దానవాయిపేట రోడ్లను తవ్వేసి నెలల గడచినా పూర్తి చేయలేదని, దీంతో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంపీ భరత్‌రామ్ వన్‌టైమ్ పొలిటీషియన్ అని వర్ణించారు. సమావేశంలో నగర ట్రేడర్స్ సెల్ అధ్యక్షుడు నిమ్మలపూడి గోవింద్, మస్తాన్‌చౌదరి, ముప్పన రుద్ర, పాల్గొన్నారు.

శ్రీ అష్టలక్ష్మి జన్మనక్షత్ర మహోత్సవ ఆహ్వానం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 23: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్ వంకాయల వారి వీధిలో అష్టలక్ష్మీ సహిత శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో అష్టలక్ష్మీ అమ్మవారి జన్మ నక్షత్ర మహోత్సవం ఈ నెల 25న నిర్వహించనున్నట్టు ఆలయ ఛైర్మన్ గుర్రం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సామూహిక కుంకుమార్చనలో అఖండ సౌభాగ్యం, పరిపూర్ణ ఆరోగ్యం, శీఘ్ర సంతాన, వివాహ ప్రాప్తి, సుఖశాంతులు కోరుకునే భక్తులు పాల్గొనవచ్చని చెప్పారు.

శక్తిగౌరిగా దర్శనమిచ్చిన పాత సోమాలమ్మ



రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 23: రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ జాతర ఉత్సవాలు శనివారం 4వ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు శక్తిగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులతో సౌభాగ్యవ్రతం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్ తెలిపారు. అమ్మవారిని రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ, ఇన్నీసుపేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు, మునిసిపల్ కార్పొరేషన్ ఈఈ రెడ్డి శేషగిరిరావు దర్శించుకున్నారు.

వలంటీర్లను ఇరకాటంలో పెట్టింది ఎంపీ భరతే

జనసేన నాయకుడు అనుశ్రీ



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలులో వుందని తెలిసి కూడా వలంటీర్లను పిలిచి సమావేశం పెట్టి వాళ్లను ఇరకాటంలో పెట్టింది ఎంపీ భరతేనని జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అత్తి(అనుశ్రీ) సత్యనారాయణ విమర్శించారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో అనుశ్రీ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనుల మాటున 25శాతం కమీషన్ తీసుకునే భరత్.. పవన్‌కళ్యాణ్‌ను విమర్శిస్తాడా, రాజమహేంద్రవరంలో డిపాజిట్లు కూడా రావని అన్నారు. పవన్‌ను అత్యధిక మెజార్టీతో పిఠాపురం ప్రజలు గెలిపించబోతున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు మీటింగ్‌లు పెట్టకూడదని తెలిసి కూడా వలంటీర్లతో మీటింగ్ పెట్టి వాళ్లకు ఉద్యోగాలు లేకుండా చేశాడని, పైగా ఆ బురదు తమ అభ్యర్థిపై జల్లే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కాంట్రాక్టరు మార్గాని సురేష్ కనుసన్నల్లో మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి అన్నిపనులు జరగడం వెనక భరత్ ఉన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో జనసేన ఉపాధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, పైడి రాజు, నల్లంశెట్టి వీరబాబు, గుణ్ణం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, మార్చి 23: ప్రశాంత వాతావరణంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో శనివారం సార్వత్రిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ గ్రామ వీధుల్లో కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులకు ఎన్నికల నిర్వహణపై సీఐ అవగాహన కల్పించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	కుంగ్‌ఫూ పాండా..
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	భీమా
నిడదవోలు	
వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి